## వీరజవాన్లకు కొవ్వొత్తులతో నివాళులు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ నందు భారతదేశ బ్లాక్‌డే పురస్కరించుకుని మాజీ సైనికులు పులిశ్రీకాంత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల వెలుగులతో పుల్వామా ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వీర జవాన్లకు నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పులి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ప్రేమికుల రోజును జరుపుకుంటారని కానీ భారత్ మాత్రం ఈరోజు బ్లాక్‌డే అన్నారు. 2019లో జరిగిన జమ్ముకాశ్మీర్‌లోని పుల్వామాలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 40మంది జవాన్లు వీరమరణం పొందారన్నారు. ఈఘటన జరిగి నేటికి ఆరేళ్లవుతోందన్నారు. ఈనాటికి వీరజవాన్ల త్యాగాలు ప్రతిఒక్కరు స్మరించుకోవాలని కోరారు. సైన్యంలో చేరడానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త




## శ్రీహరికోటలో స్వచ్ఛత పక్వాడా 2025

శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోటలో శుక్రవారం స్వచ్ఛత పక్వాడా 2025 కార్యక్రమం నిర్వహించారు. భారత ప్రభుత్వం అంతరిక్ష విభాగం వారి ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సంతకాల సేకరణ చేపట్టారు.



స్వచ్ఛభారత మిషన్ కార్యక్రమానికి ఉద్యోగుల అంకితభావాన్ని తెలియజేయడం ఈ సంతకాల సేకరణ ముఖ్య ఉద్దేశంగా చెప్పారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ముందు అనేకమంది సంతకాలు చేసి స్వచ్ఛత పక్వాడాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ వారు ఈ సందర్భంగా ఉద్యోగులు మరియు పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

# ఓటేశారు ... సైలెంట్ అయ్యారు!

### వాడుకుని వదిలేశారట!! కలిసి నడిచే అవకాశం దక్కుతుందా!?

### -వైసిపి సస్పెన్షన్ చేస్తే పరిస్థితి ఏంటనే అంతర్మథనంలో ఆ 19మంది



ప్రభాతవార్త–తిరుపతి:
తిరుపతి నగరపాలకకౌన్సిల్‌లో రెండవడిప్యూటీ మేయర్ ఎన్నికలో పార్టీ విప్‌ను ధిక్కరించి కూటమికి ఓటేసిన 24మంది వైసిపి కార్పొరేటర్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. వీరిలో 5 మంది కార్పొరేటర్లను ఇప్పటికే వైసిపి నుండి బహిష్కరించింది. మరో 19మంది విప్‌ను ధిక్కరించి టిడిపి కార్పొరేటర్‌కు మద్దతుగా నిలిచినా వైసిపి ఎటువంటి చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తోంది. నిజంగా కూటమికి ఓటేసిన మరో 19 మంది కార్పొరేటర్లను వైసిపి నుండి సస్పెండ్ చేస్తే వాళ్ళు ఏ పార్టీలో చేరాలనేది ఇప్పటికీ అయోమయంగా తయారైంది. అధికశాతంమంది తెలుగు దేశంపార్టీలో చేరేందుకు సుముఖంగా ఉన్నా అధినేత,సిఎం చంద్రబాబునాయుడు ఆ దిశగా పెద్దగా సుముఖత చూపడంలేదనేది ఆ పార్టీ నేతల సమాచారం. ఇటు జనసేన పార్టీలో చేరేందుకు కూడా కొన్ని అడ్డంకులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ గందరగోళం నేపథ్యంలో మేయర్ పదవికీ అవిశ్వాసం పెట్టాలంటే 34మంది మద్దతు ఉండాలి. నమ్మివచ్చిన 24మందికే సముచితస్థానం లేదని వాపోతున్నారు. మరీ వైసిపి వైపు 21మంది ఇప్పటికీ బలంగానే నిలబడ్డారు. ఇదే సమయంలో ఆచరణకాని పదవులిస్తామని మాయమాటలు... ప్రలోభాలు నడుమ నాలుగేళ్ళు కౌన్సిల్‌లో కొనసాగిన పార్టీని వీడి మరోపార్టీకి మద్దతు తెలిపిన ఆ 24మంది వైసిపి కార్పొరేటర్ల పరిస్థితి ముందు నుయ్యివెనుకగొయ్యి అనే చందంగా తయారైందని తిరుపతిలో రాజకీయచర్చ జోరందుకుంది. గత వైసిపి ప్రభుత్వంలో ఎంతో కొంత లాభపడిన కొందరు కార్పొరేటర్లు ఏడాది కౌన్సిల్ పాలనకు ఒత్తిళ్ళకు తలొగ్గి టిడిపి కూటమి పంచన చేరడం,ఏకంగా ఈనెల 4వతేదీ జరిగిన రెండవ డిప్యూటీ మేయర్ ఎన్నికలో వైసిపి విప్‌ను ధిక్కరించి కూటమికి మద్దతుగా నిలబడటంతో ఇప్పుడు వారి పరిస్థితి ఏంటనే అయోమయంగా మారింది. వైసిపి నుండి సస్పెన్షన్ చేస్తే కార్పొరేటర్ పదవిని కూడా కోల్పోవాల్సి వస్తుందనేది రాజకీయ విశ్లేషకుల వాదన. అయితే ఆ 24మంది భవిష్యత్తు ఇప్పుడు ఆగమ్యగోచరంగా మారడంతో ఏం చేయాలనే తలలుపట్టుకుంటున్నారు. మొన్నటి వరకు తిరుపతి నగరపాలక కౌన్సిల్‌లో ఓ వెలుగువెలిగిన కొందరు కార్పొరేటర్లు కూడా పక్క పార్టీలోకి అనధికారికంగా రావడంతో అక్కడ ఇమడగలమా?అనే సందేహంలో ఉన్నారు. కేవలం ఏడాదికాలం ఉన్న నగరపాలక కౌన్సిల్‌లో పదవుల కోసం ,తమ పనులు అధికారులద్వారా చక్కబెట్టుకోవడం కోసమే మద్దతుగా నిలిచారనేది జనంలో ఆసక్తికర చర్చ. కొంతకాలంగా తమను రమ్మని పిలుస్తున్నా కూటమిలో ఏ పార్టీలో చేరాలనేది ఇప్పటికీ 24మంది కార్పొరేటర్లులో నెలకొన్న స్తబ్ధత. అంతేగాక కొందరికి మేయర్ పదవి ఇస్తామని, ఇప్పటికే డిప్యూటీ మేయర్‌గా కొనసాగుతున్న కార్పొరేటర్‌ను కాదని మరొకరికి అవకాశం ఇస్తామని పలురకాల ప్రలోభాలు పెట్టినట్లు ఆ వర్గంలోనే గుప్పుమంటోంది. ఇవన్నీ మరచి ఎవరికి వారే సైలెంట్‌గా ఉండటంతో తమ పరిస్థితి అయోమయంగానే ఉందని కొందరు కార్పొరేటర్లు అంతర్మథనంలో పడ్డారు. ఇంకా కొలిక్కి రాని మేయర్ విషయంలో కూటమిపార్టీ తరపున ఓ మహిళ కార్పొరేటర్‌కు మాటిచ్చిన ప్రజాప్రతినిధికి కొందరు కార్పొరేటర్లు వ్యతిరేకం కావడంతో ఆ పదవి కూడా డోలాయమానంగా మారింది. వారిపై కొందరు అసహనంతోనే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే గత ఏడాది రాష్ట్రంలో టిడిపి కూటమిప్రభుత్వం ఏర్పాటు అయిన ఏడునెలలకు తిరుపతి నియోజకవర్గం జనసేనపార్టీ నాయకులు కౌన్సిల్‌పై కన్నేశారు. ఇక్కడ పట్టుసాధిస్తే కొంత వరకు పార్టీకి ప్రాణం ఉంటుందని భావించారు. ఇదే సందర్భంలో ఈనెల 3వతేదీ రెండోడిప్యూటీ మేయర్ ఎన్నికలు వాయిదా పడటం, 4వతేదీ ఏకంగా ఒకేఒక టిడిపి కార్పొరేటర్‌కు 24మంది అవకాశం ఇవ్వడంతో అంతా సర్దుకున్నట్లేనని ఊహించారు. అసలు ఏ పార్టీలో చేరారనేది కూడా ఇప్పటికీ వారికే సందిగ్ధంలో ఉన్నారు. పనిలో పనిగా ఆ రోజే స్థానిక ఎమ్మెల్యే, టిడిపి నేతలు ఆర్భాటంగా కలిసివచ్చిన కార్పొరేటర్లతో ఓ హోటల్‌లో మీడియాసమావేశం నిర్వహించి, నమ్మివచ్చిన వారికి ద్రోహం చేయబోమని, లోటు లేకుండా చూస్తామని హామీలు గుప్పించారు. కానీ గత పదిరోజులు కావస్తున్నా మద్దతు పలికిన తమకు కనీస మర్యాద లేకపోతోందని ఇప్పుడే అసలు వ్యతిరేకత మొదలైందని గెలిచిన పార్టీని కాదని వచ్చిన కొందరు కార్పొరేటర్లు తమ అనుచరులతో ఆవేదన వెలిబుచ్చుతున్నారు. డిప్యూటీ మేయర్ మద్దతుతీసుకున్న కార్పొరేటర్ కూడా తమకు సముచితస్థానం ఇవ్వడంలేదనే అసహనంతో ఉన్నారు. మొత్తంమీద మరికొద్దిరోజులు ఏం జరగనుందనేది కూడా టెన్షన్.

# బర్డ్‌ఫ్లూ టెర్రర్

### - కోళ్ళకు బర్డ్‌ఫ్లూ సోకిందని విస్తృతంగా ప్రచారం
### - తగ్గిన కోడి మాంసం విక్రయాలు





చిత్తూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:
జిల్లా ప్రజానీకానికి బర్డ్‌ఫ్లూ టెర్రర్ పట్టుకుంది. రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ వైరస్ బహిర్గతం కావడంతో జిల్లాకు సైతం కోళ్ళ ద్వారా బర్డ్‌ఫ్లూ వైరస్ సోకుతుందని ప్రజానీకం భయాందోళన చెందుతుంది. రాష్ట్రంలో ఇటీవల ఓ జిల్లాలో బర్డ్‌ఫ్లూ వైరస్ సోకడంతో ఈ వైరస్ ఇతర జిల్లాలకు వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించింది. అయినప్పటికీ బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తి చెందుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బర్డ్‌ఫ్లూ వైరస్ కోళ్ళకు అనుసంధానంగా వున్న వ్యక్తులకు సైతం ఈ వైరస్ సోకుతుంది. బర్డ్‌ఫ్లూ వైరస్ వున్న కోడి మాంసంను భుజించిన వ్యక్తులకు ఈ వైరస్ వ్యాప్తి చెందుతుంది. జిల్లాలో ఇప్పటి వరకు బర్డ్‌ఫ్లూ వైరస్ బహిర్గతం కానప్పటికీ ఈ వైరస్ వ్యాప్తి చెందే అవకాశం వుండటంతో ప్రజలు భయకంపితులు అవుతున్నారు. కొన్ని రోజుల పాటు కోడి మాంసం తినకుండా వుంటే సరిపోతుందని కొంతమంది ప్రజానీకం భావిస్తున్నారు. ఫలితంగా గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా కోడి మాంసం విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. కొన్ని రోజుల్లో కోడి మాంసం ధర సైతం తగ్గే అవకాశాలు కన్పిస్తున్నాయి. జిల్లాలో బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రవేశించకుండా జిల్లా పశుసంవర్ధకశాఖతో పాటు ఇతర శాఖల అధికారులు ఓ వైపు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలు, మన రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుండి కోళ్ళను దిగుమతి చేసుకోకుండా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. బర్డ్‌ఫ్లూ వైరస్‌పై ఇప్పటికే ప్రభుత్వం నుండి పక్కా ఉత్తర్వులు జారీ కావడంతో జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రభాకర్ గత మూడు రోజులుగా కోళ్ళ ఫారాలు తనిఖీ చేసి సర్వైలెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు బర్డ్‌ఫ్లూ వైరస్ కేసులు బహిర్గతం కాకపోవడంతో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రభాకర్ పేర్కొన్నారు.

## కోడి మాంసంను వంద డిగ్రీ ఉష్ణోగ్రతతో వుడికించి తినాలి

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి

జిల్లాలో బర్డ్‌ఫ్లూ వైరస్ భయాందోళనల నేపథ్యంలో ప్రజలు కోడి మాంసంను 100 డిగ్రీ ఉష్ణోగ్రతతో వుడికించి తినాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి పేర్కొన్నారు. కోళ్ళకు ఎవిఎన్ ఇంఫ్లుఎంజా వైరస్ సోకడం ద్వారా చనిపోతాయని, ఈ కోళ్ళతో పాటు వీటికి ఫారంలో వుంచిన దాణా, కోడి మాంసం వ్యర్థాలు తదితరాలను జాగ్రత్తగా పాలిథిన్ సంచిలో పెట్టి దూర ప్రాంతంలో పూడ్చి పెట్టడం లేదా కాల్చివేయడం చేయాలన్నారు. అలాగే కోళ్ళ షెడ్లను పోటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో ప్రతిరోజు శుభ్రం చేసుకోవాలన్నారు. కోళ్ళఫారంలో కోళ్ళను పెంచే కూలీలు ఫారంలోకి ప్రవేశించే సమయంలో చేతులు, కాళ్ళను డెటాల్‌తో పరిశుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే చనిపోయిన కోడి వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లోను ప్రజలు తాకరాదన్నారు. కోడి మాంసం తిన్న అనంతరం ఎవరికైనా జ్వరము, గొంతు బొగురు పోవడం, ముక్కు కారడం, శరీరంపై దద్దుర్లు, ఒళ్ళు నొప్పులు లాంటి లక్షణాలు కన్పిస్తే సత్వరం సమీపంలోని పిహెచ్‌సికి వెళ్ళి పరీక్షించుకోవాలన్నారు.

### తొలిరోజు

## ఏడుగంటలు విచారణ !

### -కస్టడీలో ఆ నలుగురు

తిరుపతికార్పొరేషన్, ఫిబ్రవరి 14ప్రభాతవార్త:
టిటిడికి కల్తీనెయ్యి సరఫరాచేసిన కేసులో రిమాండ్ నుండి కస్టడీకి తీసుకున్న సిబిఐ సిట్ తొలిరోజు శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకు న్యాయవాదుల సమక్షంలో ఏడుగంటలు పలు ప్రశ్నలు సంధించి సమాధానం రాబట్టారు. నిందితులు ఏఆర్ డైరీ యాజమాన్యం ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కె బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, పోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక)సిఇఒఅపూర్వవినయ్‌కాంత్‌చావ్డాలను సిట్ కార్యాలయానికి పోలీసు భద్రత నడుమ తరలించారు. ఉదయం 9గంటలనుండి సాయంత్రం 5గంటల వరకు న్యాయవాదుల సమక్షంలో సిబిఐ సిట్ అధికారులు ఎక్కడా ప్రలోభాలకు లొంగకుండా విచారణ చేసి పలు ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. ఈ మూడు డైరీలు టిటిడికి నెయ్యిసరఫరాకు టెండర్లలో ఎలా పాల్గొన్నారు?అసలు నెయ్యిసరఫరా చేయాలని మీకు సూచించిన పెద్దలు ఎవరు అనే కోణంలో సిబిఐ సిట్ అధికారులు తొలిరోజు కీలక నిందితులను విచారణ చేశారు. ఎందుకు ఇలా కల్తీ నెయ్యిసరఫరా చేయాల్సి వచ్చిందని నలుగురు నిందితులను సిట్ అధికారులు ప్రశ్నించారు. నెయ్యిట్యాంకర్లు ఎప్పుడు నుండి సరషరాచేశారు, అందులో కల్తీ ఎలా చేశారు. ఎంతకాలం కల్తీనెయ్యిని టిటిడికి పంపారని సిట్ అధికారులు ప్రశ్నలకు సమాధానం రాలేదని ,ఒకరిద్దరు అధికారుల పేర్లు వెల్లడించినట్లు విశ్వసనీయ వర్గాల కథనం.

## ఆర్టీసీ బస్సుల్ని ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేలా చర్యలు

### - ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం
### - బెంగళూరులో ఎలక్ట్రిక్ బ్యాటరీల తయారీ పరిశీలన !!



ఎలక్ట్రిక్ బ్యాటరీలను పరిశీలిస్తున్న ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఉన్న ఆర్టీసీ బస్సులన్నింటినీ ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేలా చర్యలు చేపడుతున్నట్లు ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శు క్రవారం ఆయన కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలోని తకనాల్ ఎనరీ జ్ స్ సంస్థను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన అక్కడ ఎలక్ట్రిక్ బ్యాటరీల తయారీ, అవి పనిచేసే విధానాన్ని అక్కడి ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇదివరకే ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడం జరిగిం దన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనగళ్ల నారాయణ, తాను, ఆర్టీసీ పాలకవర్గం చర్చించి పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని ఆయన పేర్కొన్నారు. నష్టాల బాటలో ఉన్న ఆర్టీసీని మరలా లాభాల బాట పట్టించేందుకు తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత వైఎస్సార్సీ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు రద్దు చేసిన నైటౌట్ వేతనాలు సైతం ఇప్పుడు తమ ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. ప్రజలకు సురక్షితమైన ప్రయాణం అందించడమే తమ లక్ష్యమన్నారు. ఆర్టీసీలో ప్రమాదాలను సున్నా శాతానికి చేరేలా డ్రైవర్లను చైతన్యపరచి ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రనేతలు గోపీనాథ్, డా॥ వెంకటేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, కౌన్సిలర్ సోమశేఖర్, తెదేపా నేత అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం వైపు అడుగులు

### - ఎంపీ దగ్గుమళ్ళ, ఎమ్మెల్యేలు గురజాల, మురళీమోహన్



చిత్తూరు, పిబ్రవరి 14 ప్రభాతవార్త:
కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం వైపు అడుగులు వేస్తోందని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు పేర్కొన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎంపీ నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్లు, ఎస్‌సిఎపి నిధులతో మురకంబట్టు ప్రధాన కూడలిలో రూ.10 లక్షలతో చేసిన సుందరీకరణ పనులను శుక్రవారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీ మోహన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ వైకాపా పాలనలో చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. గత వైకాపా ప్రభుత్వం గ్రామాలకు కనీస సౌకర్యాలను సైతం చేపట్టలేదన్నారు. వైకాపా ప్రభుత్వ నిర్ణయాలతో రాష్ట్రం ఇప్పటికే వెనుకబడి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబు ముందు రాష్ట్రంను ప్రగతి వైపు నడిపించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. దేశంలోనే రాష్ట్రంను అగ్రగామిని తీర్చిదిద్దడానికి సిఎం నారా చంద్రబాబు చిత్తశుద్ధితో శ్రమిస్తున్నారన్నారు. మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, కమీషనర్ నరసింహ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చంద్రప్రకాష్, కార్పొరేటర్ అశోక్, నాయ మధుబాబు, లక్ష్మీపతినాయుడు, సునీల్ చౌదరి, శ్రీధర్‌యాదవ్, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టాటా క్యాన్సర్ హాస్పిటల్‌చే అవగాహన



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త
టాటా క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు స్థానిక మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో అవేరేనెస్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధికి భయపడాల్సిన అవసరం లేదని, ముందుగా క్యాన్సర్‌ను గుర్తిస్తే దానికి తగ్గట్టుగా చికిత్స తీసుకుంటే నయమైపోతుంది అని తెలిపారు. గ్రామాల్లో క్యాన్సర్ వ్యాధి ఎక్కువగా ఉందని ప్రభుత్వం వారు పింకు బస్సులు ఏర్పాటు చేసి ఇంటి వద్దనే స్క్రీనింగ్ చేస్తున్నారని, అలాగే ఎవరికైనా అనుమానం ఉంటే వ్యాధి నిర్ధారణ కోసం ఇంటి వద్దనే పరీక్ష చేసుకొని, హాస్పిటల్‌కి వచ్చి ట్రీట్మెంట్ తీసుకోవచ్చని సూచించారు. ఒకప్పుడు క్యాన్సర్ ట్రీట్మెంట్ తీసుకోవాలంటే బయట వెళ్లాల్సి ఉండేది ఎంతో ఖర్చుతో కూడుకున్నదని, ఇప్పుడు టాటా గ్రూపు వారు తిరుపతిలో వరల్డ్ క్లాసు హాస్పిటల్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డియంహెచ్‌ఓ బాల కృష్ణ నాయక్, టాటా కాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ ప్రశాంత్, మెటర్నిటీ సూపరింటెండెంట్ పార్థసారథి, ఎస్వి పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు, ఎస్‌పిడబ్ల్యూ విధ్యార్థినీలు, ఎన్‌సిసి విద్యార్థులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమరవీరుల సైనికుల త్యాగాలను మర్చిపోకూడదు

### - భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్ కుమార్





గూడూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త
భారతీయ జనతా యువమోర్చా బీజేవైఎం గూడూరు ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాల మేరకు మరియు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మిట్ట వంశి ఆదేశాల మేరకు బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ ఆదేశాల మేరకు బీజేవైఎం తిరుపతి జిల్లా అధ్యక్షులు కిషన్ రెడ్డి సూచనలు మేరకు గూడూరు పట్టణంలో స్థానిక జడ్పీ బాలు హైస్కూల్లో పుల్వామా ఘటనలో అమరులైన సైనికులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్ కుమార్ మాట్లాడుతూ అమరులైన సైనికులు త్యాగం వృధా కాదని వాళ్ళ ఆశయం ఆగిపోదని ఆయన అన్నారు ప్రతి విద్యార్థి, యువత వాళ్ల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ బాలుర హై స్కూల్ ఇన్చార్జి ప్రిన్సిపల్ దామోదర్, బీజేవైఎం నగర అధ్యక్షులు శివశంకర్, బీజేవైఎం ఉపాధ్యక్షులు కార్తీక్, ప్రణయ్, నవీన్, కిరణ్, ప్రదీప్, అరవింద్, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## ఎంబియు బౌన్సర్ల అరాచకాలు :మంచు మనోజ్



చంద్రగిరి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:
మోహన్ బాబు యూనివర్శిటీకి చెందిన బౌన్సర్ల అరాచకాలు నానాటికీ అంతులేకుండా పోతున్నాయని సినీ హీరో మంచు మనోజ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎంబియు ఎదురుగా ఎఫ్5 హోటల్ నిర్వహించుకుంటున్న తన అనుచరుడు అనిల్‌తో కలసి శుక్రవారం ఆయన సిఐ సుబ్బరామిరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల ఎదురుగా హాస్టళ్ళు నిర్వహిస్తున్న వారి నుండి మామూళ్ళు వసూళ్ళు చేస్తున్నట్లు ఆరోపించారు. కొంత కాలంగా మోహన్‌బాబు కుటుంబంలో తలెత్తిన వివాదాలతో తనను టార్గెట్ చేసినట్లు ఆయన వాపోయారు. తనపై కోపంతో తన అనుచరుల ఎఫ్5 రెస్టారెంట్‌ను ధ్వంసం చేశారని అన్నారు. వాళ్ల మాటవినని వారి కుటుంబ సభ్యులను సైతం లక్ష్యంగా చేసుకుంటున్నారని అన్నారు. దాడి చేయడం, సిసి ఫుటేజీలను లాక్కెళ్ళడం సర్వసాధారణ మయ్యిందని అన్నారు. ఇకనైనా భౌన్సర్ల ఆగడాలను అరికట్టాలని కోరారు. అక్రమ వసూళ్ళలో ఎంబియు సిబ్బంది హేమాద్రి నాయుడు, వినయ్, మహేశ్వరి, ఫోటో గ్రాఫర్ మౌళి ప్రధాన పాత్రదారులుగా చెప్పారు.

### భోళాశంకరుని ఉత్సవాలు

# ఊరంతా సంబరాలు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త
తిరుపతిజిల్లా ధార్మిక క్షేత్రంగా విరాలజిల్లుతుంది. దక్షిణ కైలాసంలో పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయం భువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నాడు. 'భోళాశం కరునికి ఏటా మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించటం ఆనవాయితి.ఈ ఉత్సవాలకు ఊరంతా సంబరాలు' జరుపుకొనుటకు సన్నాహాలు జరుగుతున్నాయి.పట్టణంలోనూ చుట్టుపక్కల గ్రామాల్లో ముస్తాబులే ముస్తాబులన్నట్లు మారింది.ఎటు చూసినా విద్యుత్ దీపాల కాంతులతో పాటు ఈ సారి ప్రత్యేకంగా 'లేజర్ వెలుగులతో జిగేలు' మని పించేలా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించి అమలు చేసారు. మంత్రులు రూ.7కోట్ల అంచనా బడ్జెట్‌తో ఏర్పాట్లు చేస్తున్నారు.పట్టణంలోని మూల మూలల్లోనూ, అనుబంధ ఆలయాల్లో విద్యుత్ దీపాల సంబరాలు కల్పిస్తున్నారు.

**ఆకర్షిణీయంగా రూపు దిద్దుకుంటున్న విద్యుత్ దేవుళ్ళు,**

శ్రీకాళహస్తి ఆలయంలో విద్యుత్ దీపాలు ఆకట్టుకుంటున్నాయి. ఈ సారి శాశ్వత విద్యుత్ వెలుగులు అందించుటకు చర్యలు తీసుకున్నారు. సంప్రదాయాలకు పెద్దపీట వేసినట్లు రూపుదిద్దుతున్నారు. ఇప్పటికే నెల రోజుల నుంచి ఆలయం లోపల విద్యుత్ దీపాలంకరణలకు ప్రాధాన్యతతో ముస్తాబులు చేసారు. ఆలయం అంతా రంగు రంగుల ముగ్గులు వేసారు. ఇక విద్యుత్ దీపాలంకరణలో చూడటానికి వేయి కళ్ళు చాలవన్నట్లు మారింది. ఇక బిక్షాల గాలిగోపురానికి అమర్చిన 'ఓం నమ:శివాయ'అనే నూయాన్ లైటింగ్ ఇటు తేరువీధి, అటు బజారువీధులను పాల వెలుగుల్లా మార్చేసింది. కృష్ణారెడ్డి మండపం వద్ద బస్సులు దిగే భక్తులకు ఆలయం ఎక్కడో మార్గదర్శక సూచకంగా ఉంది.ఇక ప్రతి విద్యుత్ వెలుగు పై కాషాయం అకర్షణీయంగా మారింది.గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి విద్యుత్ అలంకరణలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఊరంతా పండగ అన్నట్లుమారింది.





మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబౌతున్న దక్షిణ కైలాసం

**సాంస్కృతిక వేదికకుప్రాధాన్యత:**

బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతిక వేదికకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. 13రోజుల పాటు జరిగే ఉత్సవాలలో సంప్రదాయ కళాకారులకు వేదికపై అవకాశం కల్పించుటకు పాలకులు నిర్ణయించుకొని ప్రణాళిక రూపొందించారు.సుమారు 150 మంది యువ కళాకారులకు అవకాశం కల్పించారు. ఈ నెల 21 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

## పంచాయితీకి ఆదాయం వచ్చేలా వనరులను పెంచాలి

**జిల్లా పంచాయితీ అధికారి సుధాకర్ రావు**



కల్లూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

గ్రామపంచాయతీకి ఆదాయం వచ్చేలా వనరులను పెంచాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు అన్నారు. పులిచెర్ల మండలం దేవళం పేట కల్లూరు గ్రామ సచివాలయాలను శుక్రవారం డిపిఓ తనిఖీ చేశారు. తొలుత దేవళం పేట సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక రికార్డులను పరిశీలించారు. సిబ్బంది విధుల పట్ల సమర్ధవంతంగా ఉండాలని అన్నారు అనంతరం కల్లూరు గ్రామ సచివాలయాలు, డంపింగ్ యార్డ్ ను పరిశీలించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిగా సంపద తయారీ, ఆదాయం తదితర వాటి గురించి డిపిఓకు ఈ.వో నాగరాజు వివరించారు కేంద్రం చుట్టూ 15వ ఆర్థిక సంఘం నిధుల.నుంచి పెన్సింగ్ ఏర్పాటు చేయాలని డిపిఓ, ఈవోను ఆదేశించారు. పరిసరాలు పరిశుభ్రతగా ఉంచాలని నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు సురేష్. రేణుక, సచివాలయ సిబ్బంది లోకేష్, భరత్ కుమార్, రోహిణి, చరీనా, శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ కిరణ్, సి ఓ లు రమణి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు, పురుగు మందుల దుకాణాల ఆకస్మిక తనిఖీ

కల్లూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



పులిచర్ల మండలంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక స్వాడ్ కల్లూరులోని ఎరువుల, పురుగు మందులు, విత్తన దుకాణాలను ఆకస్మికంగా శుక్రవారం తనికీ చేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మజ, వ్యవసాయాధికారి ప్రసన్న లక్ష్మిలు తనిఖీ చేశారు. దుకాణాదారులు నిర్వహిస్తున్న రికార్డులు పరిశీలించారు. అందుబాటులో వున్న స్టాకును పరిశీలించారు. రైతులకు అందిస్తున్న బిల్లులు, లైసెన్సులను పరిశీలించారు. కల్లూరులోని మణికంఠ ఎరువుల దుకాణం, శ్రీ శ్రీనివాస విత్తన, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేసారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించాలని, ప్రభుత్వం నోటిపై చేసిన కంపెనీ నందు వారి ఉత్పత్తులు ఉంచాలని అదే విధంగా రైతులకు బిల్లులు కూడా ఖచ్చితంగా అందించాలని సూచించారు. ఎరువులు రైతు ఆధారుతోనే ఇవ్వాలని ఎటువంటి తప్పిదాలు చేయకూడదని తెలిపారు. ఈ తనిఖీలో వ్యవసాయాధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.

## దామోదరం సంజీవయ్యకు నివాళి

**చిత్తూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అముద, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్‌లు ఘన నివాళులు అర్పించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం తొలి దళిత సిఎం దామోదరం సంజీవయ్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ అముద, కమీషనర్ నరసింహప్రసాద్‌లు తొలి దళిత సిఎం దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యుటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, ఎసిపి నాగేంద్ర, సిఎంఎం నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సహకారం

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:



ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు తమ వంతు సహాయసహకారాలు అందించాలని సభ్యులు కోరారు. స్థానికి ఎంపిడిఓ కార్యాలయ సమావేశభవనంలో ఎంపిపి అమరావతమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రతి మూడు నెలలకు ఒక పర్యాయం జరిగే సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై అధికార గణం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఏ మేరకు పరిష్కరించారో ఈ సమావేశంలో వివరించాల్సి న బాధ్యత అధికారులపై వుందన్నారు. రెవెన్యూపరమైన సమస్యలను తమ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని తహసిల్దారు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రత్యేక పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఎడి డాక్టర్ ఆసీఫ్ చెప్పారు. పేయదూడలో గర్భ నిర్ధారణ కోసం రైతులు 500 రూపాయలు చెల్లించాలన్నారు. గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని బకాయి బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తోందని హౌసింగ్ ఎఇ పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బందికి ఇతర పనులు కేటాయించరాదని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌కుమార్ అధికారుల దృష్టికి తెచ్చారు. జిల్లేడుపల్లి గ్రామ సచివాలయ భవన నిర్మాణంపై సర్పంచ్ భారతమ్మ అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు శిరీష్‌రెడ్డి, జయకుమార్‌లు, ఇన్‌ఛార్జీ ఎంపిడిఓ శ్రీధర్, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు కోకా ప్రకాష్‌నాయుడు, ఎంపిటిసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## కడకు మరో యాభై కోట్ల నిధులు మంజూరు

కుప్పం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడ)కు రాష్ట్ర ప్రభుత్వం మరో యాభై కోట్ల రూపాయల నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కుప్పం మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనుల కోసం 92కోట్లను మంజూరు చేయగా అందులో తొలివిడతగా ఇదివరకే 42కోట్లను విడుదల చేసిన ప్రభుత్వం తాజాగా 50కోట్ల నిధులు విడుదల చేసింది. దీంతో త్వరలోనే 92 కోట్లతో అభివృద్ధి పనులకు టెండర్లు పిలవనున్నారు.

## గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు 30లక్షల నిధులు

**రామకుప్పం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** మండలంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు జడ్పీ ద్వారా ముప్పై లక్షల నిధులు కేటాయిస్తామని జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రామ కుప్పంలో ప్రజాప్రతినిధులతో సమావేశమ య్యారు. మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటిసి నితిన్‌రెడ్డి, ఎంపిపి సుబ్రమణ్యం, ఎంపిడిఓ మురళీధర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## బిందు సేద్య రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

యర్రావారిపాలెం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

ప్రభుత్వం అందించే బిందు సేద్య రాయితీ ప్రోత్సాహన్ని జిల్లాలోని రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలి అని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం చిన్న గొట్టిగల్లు మండలం, ఎర్రావారిపాలెంలోని ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న సీసీ రోడ్లు, బిందు సేద్యం ద్వారా సాగు చేస్తున్న మామిడి, బొప్పాయి పంట సాగు విధానాలను పరిశీలించి రైతులకు పలు సూచనలుజిల్లా కలెక్టర్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పాధి హామీ పథకం కింద భాకరాపేట పంచాయతీ లోని ఎన్టీఆర్ కాలనీ సిసి రోడ్లును, అనిమల్ షెడ్స్, ఎర్రావారిపాలెం మండలం లోని పులుపుత్ర వారిపల్లె లోని సిసి రోడ్డు, ఫాగ్ హౌస్ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం శ్రీనివాసులు అనే రైతుకు చెందిన మామిడి పంట సాగును పరిశీలించి క్రిమి సంహారక మందులతో కాకుండా సేంద్రీయ పద్ధతిలో మామిడి పంట దిగుబడి పెంచేలా సాగు ఉండాలని తెలిపారు. చిన్నగొట్టుగల్లుకు చెందిన నరసింహులు అనే రైతు సాగు చేసిన మామిడి పంటకు (భూగర్బ జలాలను నీరు నిల్వ) నీటి సదుపాయం లో బాగంగా ఉపాధి హామీ పథకం కింద బౌండర్ ట్రెంచేస్ విధానంను గురించి రైతును అడిగి తెలుసుకొన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఈ పనులు చేబడుతున్నామని ద్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. లూప్ పద్ధతితో సాగుచేస్తున్న రైతును జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మల్చింగ్ పద్ధతిలో టమోటా పంట సాగు,ప్యాక్ హౌస్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యర్రావారిపాలెం మండలంలో ఏ పి ఓ మహేష్, ఎమ్ ఆర్ ఓ పరమేశ్వర స్వామి, అగ్రికల్చర్ ఆఫీసర్ ఖాదర్ భాష, ఎమ్‌పిడిఓ, హార్టికల్చర్ ఆఫీసర్,అధికారులు వెంట ఉన్నారు.

## ముఖ్యమంత్రిని కలసిన మాదిరాజు

చౌడేపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును పుంగనూరు నియోజకవర్గ సీనియర్ తేదేపా నాయకుడు మాదిరాజు వెంకట్రమణరాజు, ఆయన తనయుడు మాదిరాజు సుదీప్‌రాజు, యశ్వంత్‌రాజులు కలిశారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో కలిసి నియోజకవర్గ ప్రస్తుత పరిస్థితులు, అభివృద్ధిపై సమీక్షించినట్లు వారు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును సత్కరించారు.

## విద్యార్థులు కంటి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలి

**పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్**

కాణిపాకం ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:



కళ్ళు దేవుడిచ్చిన అద్భుత వరమని అలాంటి కళ్ళ ఆరోగ్యం పట్ల విద్యార్థులు జాగ్రత్తగా వుండాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. శుక్రవారం అగరంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి దృష్టి లోపు వున్న విద్యార్థులకు ఎమ్మెల్యే మురళీమోహన్ చేతుల మీదుగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి, ప్రతి ఏటా కనీసం ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు ఈసందర్భంగా పాఠశాలలోని 400 మంది విద్యార్థులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం వున్న 27 మంది విద్యార్థులకు కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. ఈకార్యక్రమంలో అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ అర్పిత, మండల కన్వీనర్ గిరినాయుడు, పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్, కాణిపాకం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ స్వాతి సింధూర, డాక్టర్ రాజేశ్వరి ఆరోగ్య విస్తరణాధికారి శివయ్యలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు శ్రీ లక్ష్మి గణపతి స్వామి నూతన శిలా విగ్రహం ప్రతిష్ట

పూతలపట్టు, ఫిబ్రవరి 14. ప్రభాతవార్త

మండల పరిధిలోని బండమీద ఊరులో శ్రీ లక్ష్మి గణపతి స్వామి నూతన శిలా విగ్రహ ప్రతిష్ట మహోత్సవంకు భక్తులందరూ విచ్చేసి స్వామి వారిని దర్శించుకోవాలని మండల ప్రజలను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుంటూరు మురళీ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం ఎనిమిది గంటలకు గణపతి పూజ నూతన శిలలకు అభిషేకం సర్వ దేవతలు హోమం, నవగ్రహాలు హోమం గణపతి హోమం మధ్యాహ్నం రెండున్నర గంటలకు నూతన శిలాల గ్రామోత్సవం, సాయంత్రం ఐదు గంటలకి సకల దేవతల పూజ, ఏడున్నరకి శతకాల అభిషేకం మూర్తి హోమం, హారతి ప్రదర్శనలు రాత్రి ఆలయ బలిహార వాస్తవము హోమం, 16వ తేదీ ఆదివారం ఉదయం 6:30కి గంటలకు గణపతి పూజ, హోమం 8:20కి యంత్ర ప్రతిష్ట శిఖర చలా ప్రతిష్ట ప్రాణ ప్రతిష్ట కళావాహన కన్య దర్పణ,గోవు మహోత్సవము ఆశీర్వాదం, ఆదివారం ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుంటూరు మురళీ తెలిపారు.

## కుప్పంలో టూరిజం అభివృద్ధిపై లోగో డిజైన్ పోటీలు

***కుప్పం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త*** తదేకం ఫౌండేషన్ మరియు కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ)అధ్వర్యంలో కుప్పంలో టూరిజ ం అభివృద్ధిపై లోగో డిజైన్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఔత్సాహికులు ఒక లోగోతో పాటు క్యాప్షన్‌ను రూపొందించి వాటిని పిడిఎఫ్ ఫార్మాట్‌లో 9310814920కు వాట్సప్ లేదా ప్రాజెక్ట్‌డైరెక్టర్‌కడ జిమెయిల్‌కు పంపాల్సి ఉంటుంది. ఈనెల 17వతేది లోగా వీటిని అందించాల్సి ఉంది. మొదటి బహుమతిగా 10వేల రూపాయలు నగదు బహుమతి అందిస్తారు. మహాశివరాత్రి నాడు లోగోను ఆవిష్కరిస్తారు.

## ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



**కుప్పం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** ఉమ్మడి ఆంధ్రరాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య జయంతిని కుప్పం మున్సిపల్ కార్యాల యంలో ఘన ంగా నిర్వహించారు. ఈసందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు సంజీవయ్య జీవితం గురించి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, ఎఇ ఆంజనేయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వన్ఎంవన్‌బి సంస్థ శిక్షణకు 16లోగా దరఖాస్తులు

కుప్పం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆశీస్సులతో కుప్పం ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు వన్ఎంవన్‌బి సంస్థ ముందుకువచ్చిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈసంస్థ అధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్ కోర్సులు చదివిన నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ కల్పించడంతో పాటు వన్ఎంవన్‌బి సంస్థ వారే ఉపాధి అవకాశాలను కల్పిస్తారన్నారు. ఇందుకోసం ఆసక్తికలిగిన కుప్పం ప్రాంత నిరుద్యోగ యువత ఉచిత శిక్షణ తరగతుల కోసం ఈనెల 16వతేది లోగా తమ దరఖాస్తులను కుప్పం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అందించి తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని ఆయన సూచించారు.

## నేడు ద్రవిడ వర్సిటీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కుప్పం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

ద్రవిడ వర్సిటీలో శనివారం బెంగళూరుకు చెందిన రోమన్ టెక్నాలజీ సంస్థ వారు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్ తెలిపారు. బికాం, బిబిఎ, ఎంబిఎ విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఆర్డీఓ శ్రీనివాసుల్లురాజుచే ఆకస్మిక తనిఖీలు



గుడుపల్లె, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులురాజు శుక్రవారం గుడుపల్లె మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అగరం పంచాయతీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని ఆయన పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయం, విలేజ్ క్లినిక్‌లతో పాటు కస్తూరిబా గురుకులంను తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. భోజనం నాణ్యతను పరిశీలించారు.

## తీరిన నీటి సమస్య

**శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** దశాబ్ద కాలంగా మండల కాంప్లెక్స్‌లో నెలకొన్న నీటి సమస్యకు పరిష్కారం లభించింది. మండల కాంప్లెక్స్ పరిసరాల్లో శుక్రవారం బోర్ డ్రిల్ చేయడంతో బోరులో నీరు పుష్కలంగా వచ్చింది. దశాబ్ద కాలంగా మంచినీటి కోసం అల్లాడుతున్న అధికారులు, సిబ్బందికి ఇకపై మంచినీటి సమస్య తీరిందని అధికారులు పేర్కొన్నారు. తహసిల్దారు లోకనాథపిళ్ళై,

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పాఠశాలలో ఆర్డీవో ఆకస్మిక తనిఖీ

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు ఆకస్మిక తనకి నిర్వహించారు. పాఠశాలల్లోని మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, రికార్డులను తనఖీ, చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో భవాని మాట్లాడుతూ పాఠశాలల్లో అంగన్వాడీలలో, విద్యార్థుల మౌలిక వసతులు తదితర అంశాల పై ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఐసిడిసిరాజేశ్వరి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నీరు,పారిశుద్ధం రోడ్లు మెరుగుకు అనుమతులివ్వండి

పుంగనూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త



పుంగనూరు పట్టణంతో సహా నియోజకవర్గంలో నీరు పారిశుధ్యం రోడ్లు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని తెలుగుదేశం పార్టీ నాయకుడు వెంకట రమణ రాజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. శుక్రవారం విజయవాడ కార్యాలయంలో ముఖ్యమంత్రి కలిసి నియోజకవర్గంలో వేసవి ముందస్తు చర్యలు చేపట్టేందుకు తక్షణ చర్యలు అవసరమని తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని అన్ని ఆర్‌ఓ ప్లాంట్లు పునరుద్దరింప చేసేందుకు అనుమతులు కావాలన్నారు. దీనికి తోడు గ్రామీణ రోడ్లు గ్రామీణ పారిశుద్ధం కాలువలు మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. పుంగనూరు పట్టణంలో తెలుగుదేశం ఆధ్వర్యంలో నిర్వహించిన టిట్కో ఇండ్ల పరిస్థితి ఆగ మ్యాగోచరంగా మారిందన్నారు. వీటిలో ఇప్పటివరకు చేరిన లబ్ధిదారులు మిగిలిన ఇండ్లు వాటి నిర్వహణ లబ్ధిదారులు ఎంపిక వంటి విషయాలను పునః పరిశీలన చేయాలన్నారు. పట్టణంలోని ఆటో లారీ డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా ఆటోనగర్ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తెలుగుదేశం నాయకులు సుదీప్ రాజు, యశ్వంత్ రాజులు పాల్గొన్నారు.

## నిద్రమత్తు విడిచిపెట్టి పనిచేయండి : భవానీ

**-విఆర్వోల తీరుపై మండి పడ్డ ఆర్డీఓ**



చౌడేపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

నిద్రమత్తు విడిచిపెట్టి ప్రభుత్వ లక్ష్యం దిశగా పనిచేయాలని పలమనేరు ఆర్డీఓ భవానీ మండి పడ్డారు. శుక్రవారం స్థానిక పరిపాలనా భవనంలోని తహశీల్దార్ కార్యాలయంలో డిసెంబర్‌లో నిర్వహించిన రెవిన్యూ సదస్సుల వినతులపై సమీక్షించారు. మండలంలో జరిగిన రెవిన్యూ సదస్సులందు రైతుల నుంచి 477వినతులందాయనీ, అయితే ఇప్పటి వరకు కేవలం 98మాత్రమే పరిష్కరించబడ్డాయన్నారు. మత్తు వదలి పనిచేయక పోతే షోకాజ్ నోటీసులు తీసుకోవాల్సి వుంటుందని విఆర్వోలు, సచివాలయాల సర్వేయర్లును హెచ్చరించారు. ప్రభుత్వం రెవిన్యూ సదస్సులను ప్రతిష్టాత్మకంగా తీసుకొందన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. అనంతరం పంచాయతీల వారీగా విఆర్వోలు, సర్వేయర్లలతో వినతి పత్రాలపై సమీక్షించారు. తహశీల్దార్ హనుమంతు, డిటి మాధవి, ఆర్ఐ భారతి, మండలంలోని విఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

## దామోదరం జ్ఞాపకం నిలవాలి సజీవం

చౌడేపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త



నిరాడంబరతకు నిలువుటద్దంగా నిలచిన రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోధరం సంజీవయ్య జ్ఞాపకాలు సజీవంగా నిలవాలని ఎపి డిసిసిబి ఉద్యోగస్తుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బ్యాంకు రెడ్డెప్ప అన్నారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత దామోధరం సంజీవయ్య 104వ జయంతిని పురస్కరించుకొని స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలేసి నివాళులర్పించారు. సిపిఎం మండలాధ్యక్షుడు డాక్టర్ చంద్ర, మాజీ సర్పంచు వేణుగోపాల్, కూరపర్తి శ్రీనివాసులు, బస్టాండు శేఖర్, వార్డన్ సురేష్‌రెడ్డిదీపారాణి, కూరపర్తి ఈశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బెండపల్లి చెరువును కాపాడేదెవరు..?

**- అధికారుల సాక్షిగా అక్రమంగా మట్టి తరలింపు !!**



బెండపల్లి చెరువులో మట్టి తరలిస్తున్న దృశ్యం

శాంతిపురం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండల ం పరిధిలో గల కోతిగుట్లపల్లి, రెడ్లపల్లి గ్రామాలకు సంబంధించిన బెండపల్లి చెరువులో అక్రమ మట్టి రవాణా మళ్లీ ఊపందుకుంది. రెండు రోజుల ముందు పత్రికల్లో వార్తలు రాగా స్పందించిన అధికారులు మట్టి అక్రమ రవాణాను నిలుపుదల చేశారు. అయితే రాజకీయ నేతల ఒత్తిడో అధికారుల చేతివాటమో తెలియదు కానీ మరలా శుక్రవారం బెండపల్లి చెరువులో అక్రమంగా మట్టి తరలింపు ప్రారంభించారు. ఎవరైనా రైతులు తమ పొలాలకు చెరువు మట్టి తరలిస్తే నిబంధనలు చెప్పే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఇప్పుడు ఎందుకు మిన్నకుంటున్నారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొంతమంది నేతలు చేసే తప్పుడు పనులతో ముఖ్యమంత్రికి చెడ్డపేరు వస్తోందని తెదేపా నేతలే విమర్శిస్తున్నారు. ఇలాగే కొనసాగితే మండల కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని రైతులు హెచ్చరి ంచారు. ప్రభుత్వానికి కనీస రుసుం కూడా చెల్లించకుండా మట్టిని అక్రమంగా తరలించడంతో ఆంతర్యమేంటో. పరిస్థితి ఇలాగే ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి ఆ పంచాయతీల్లో గడ్డు పరిస్థితి నెలకొనే ప్రమాదం ఉందని చర్చలు జరుగుతున్నాయి. ఈ విషయంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ స్పందించి అక్రమ మట్టి తరలింపుకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంగా ప్రభాతవార్త శాంతిపురం తహశీల్దార్‌ను వివరణ కోరగా తాము వెళ్లిన సమయంలో మట్టి తరలింపు ఆపేశారన్నారు. మరలా మట్టి తరలిస్తున్నారంటే విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఒక్కమాటలో దాటవేశారు. కాగా ఏళ్ల తరబడి జెండాలు మోసిన కార్యకర్తలు అలాగే ఉంటే ఎన్నికల సమయంలో వచ్చిన వారు తామే పార్టీని భుజస్కంధాలపై మోసి చంద్రబాబుకు మెజార్టీ తెచ్చినట్లు మాట్లాడడం సమంజసం కాదని ఇందుకు స్థానిక, నియోజకవర్గ నేతలు సమాధానం చెప్పే రోజు వస్తుందని కార్యకర్తలు పేర్కొంటున్నారు.

## నేడు సుబ్రమణ్యేశ్వరస్వామి కుంభాభిషేక వేడుకలు

**గుడిపాల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** కందగిరి వల్లి సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ద్వితీయ పుష్కర కుంభాభిషేక వేడుకలు శని, ఆదివారాల్లో జరుగనున్నాయి. ఈ కుంభాభిషేక వేడుకలను పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ ఛైర్మన్ సుబ్రమణ్యంనాయుడు పిలుపునిచ్చారు. కుంభాభిషే ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విఘ్నేశ్వరస్వామి పూజ, మొదటి యాగశాల పూజ నిర్వమించారు. శనివారం మూలస్థాన స్వామి వారికి మహా కుంభాభిషేకం, ఆదివారం మండలాభిషేకం జరుగుతుందన్నారు. అలాగే కుంభాభిషేకం పురస్కరించుకుని భక్తులను అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ తెలిపారు. ఈ కుంభాభిషేక ఉత్సవానికి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు తదితరులు హాజరై ఆలయంను దర్శంచుకోనున్నారన్నారు.

## ఏప్రిల్ 21 నుంచీ అంతర్జాతీయ సదస్సు

తిరుపతి విద్య ఫిబ్రవరి 14 ప్రభాత వార్త



ఏప్రిల్ 21వ తేదీ నుంచీ మూడు రోజుల పాటు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు.సైన్స్ అండ్ టెక్నాలజీ అప్లికేషన్ ఆఫ్ రేర్ ఎర్త్స్ అంశంపై మూడు రోజులపాటు నిర్వహించే ఈ సదస్సులో దేశ,విదేశీ ప్రతినిధులు పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పిస్తారు.రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఎస్వీయూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం పద్మావతి యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నాయి.ఇందుకు సంబంధించిన బ్రోచర్లను ఎస్వీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు,పద్మావతి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి.ఉమ,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని తదితరులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో వస్తున్న పరిణామాల పై ఈ సదస్సులో అర్థవంతమైన చర్చ సాగాలని కోరుకున్నారు.సదస్సు నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో రేర్ ఎర్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ ఎం.ఎల్. పి.రెడ్డి,సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్‌కెటిరామకృష్ణారెడ్డి, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు,తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ క్రైం, డిజిటల్ అరెస్టలపై అవగాహన

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త




జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కె.వి. రవిమనోహరాచారి తిరుపతి అధనపు ఎస్పీ శాంతిభద్రత వారి ఆధ్వర్యంలో శుక్రవారం గాయత్రి కళాశాలలో సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్ట్ అనే అంశాలపై విద్యార్ధినీ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌లు నేటి డిజిటల్ సమాజంలో పెరుగుతున్న ప్రమాదాలలో ఒకటన్నారు. అజ్ఞాత లింక్‌లపై క్లిక్ చేయడం, తెలియని వ్యక్తులకు మీ వ్యక్తిగత వివరాలు ఇవ్వడం, బలహీనమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం వంటి చిన్న తప్పులు మనల్ని పెద్ద నష్టాలకు గురి చేస్తాయి. సైబర్ నేరగాళ్ళు మన డేటాను దొంగిలించడం, మన డబ్బును అపహరించడం లేదా మన సమాచారాన్ని దుర్వినియోగం చేయడం వంటి ప్రమాదాలు చాలా సాధారణమయ్యాయి. అందువల్లమనం ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలి. అజ్ఞాత మెసేజీలు, లింక్‌లు మరియు ఇమెయిల్‌లను నమ్మకండి. బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించండి, టూ ఫ్యాక్టర్ ఆథెంటికేషన్‌ను ఆన్ చేయండి. సైబర్ సెక్యూరిటీ గురించి తెలుసుకొని, జాగ్రత్తగా ఉండడం ద్వారా మనం సైబర్ నేరాల నుండి మనల్ని మనం కాపాడుకోవచ్చు అన్నారు. డిజిటల్ అరెస్ట్ అనేది ఇప్పుడు సైబర్ నేరగాళ్ళు ఉపయోగించే ఒక కొత్త మోసపు పద్ధతి. ఇందులో, నేరగాళ్ళు పోలీసులు లేదా ప్రభుత్వ అధికారులమని చెప్పి మీకు కాల్ చేసి, మీరు ఏదైనా నేరంలో చిక్కుకున్నారని, మీకు అరెస్ట్ వారెంట్ జారీ అయ్యిందని చెప్తారు. తర్వాత, మీరు జైలుకు వెళ్లకుండా ఉండాలంటే డబ్బు చెల్లించమని డిమాండ్ చేస్తారు. ఈ మోసంలో చిక్కుకునే వారు భయపడి, తమ బ్యాంక్ వివరాలు లేదా డబ్బును వారికి అందించే ప్రమాదం ఉంది. అందువల్ల ఎప్పుడూ గుర్తుంచుకోండి, పోలీసులు లేదా ఏవైనా అధికార సంస్థలు ఫోన్ ద్వారా డబ్బు డిమాండ్ చేయరు. అలాంటి కాల్స్ వస్తే, వెంటనే మీ దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు సంప్రదించండని తెలిపారు. డిజిటల్ అరెస్ట్ వంటి మోసాల నుండి జాగ్రత్తగా ఉండి, మిమ్మల్ని మీరు కాపాడుకోండని అన్నారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ సి.ఐ మురళి మోహన్, గాయత్రి కళాశాల యాజమాన్యం, పోలీస్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## 3,500 మందికి ఉచితంగా కంటి అద్దాలు

**- మొబైల్ ఫోన్లకు దూరంగా విద్యార్థులు వుండేలా చర్యలు**
**- కలెక్టర్ సుమిత్‌కుమార్**



చిత్తూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: జిల్లాలో కంటి సమస్యలతో బాధపడుతున్న 3,500 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. చిత్తూరు పిసిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుతో కలిసి విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం మనం డిజిటల్ యుగంలో వున్నామని, పిల్లలు మొబైల్ ఫోన్ల వినియోగానికి అలవాటు పడుతున్నారని, ఈ కారణంగా పిల్లలకు చిన్న వయస్సులోనే కంటికి హాని కలుగుతుందన్నారు. పిల్లలు మొబైల్ ఫోన్లకు దూరంగా వుండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ పిల్లలకు మొబైల్ ఫోన్లతో ఎంతో ఉపయోగం వుందో అంత నష్టం వుందన్నారు. పిల్లలందరు మొబైల్ ఫోన్లకు దూరంగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, జాతీయ అంధత్వ నివారణ సంస్థ డిపిఎం అర్పిత, పిసిఆర్ హైస్కూల్ హెడ్మాస్టర్ పూర్వాని, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 1400లీటర్ల సారా ఊట ధ్వంసం.. ఒకరి అరెస్ట్

***కుప్పం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త*** జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ ఆదేశాల మేరకు కుప్పం ఎక్సైజ్ సిఐ నాగరాజ, చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ పవన్, ఎస్సైలు మోహన్‌బాబు, సు బ్రమణ్యంలు తమ సిబ్బందితో కలసి శుక్రవారం రామకుప్పం అటవీ ప్రాంతంలో నాటుసారా స్థావరాలపై మెరుపుదాడులు చేశారు. ఈసందర్భంగా 1400లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. మిట్టపల్లి క్రాస్ వద్ద ఓ వ్యక్తి నుంచి 25 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్ట్ చేశారు. కాగా కుప్పం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎవరైనా నాటుసారా తయారీ, విక్రయాలు, కర్ణాటక మద్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సిఐ నాగరాజ హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లిపాల ఆవశ్యకతను తల్లులకు వివరించాలి..!



**రామచంద్రాపురం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** చంటి పిల్లల తల్లులకు తల్లిపాల ఆవశ్యకతను అంగన్‌వాడీ వర్కర్స్ వివరించాలని సిడిపిఓ సుధారాణి అన్నారు. శుక్రవారం కమ్మకండ్రిగలోని చేకూరి ఎర్రమ్మ, నాగమ నాయుడు జడ్పీ హైస్కూల్లో పోషణ బి, పడాయి బి రెండవ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటు సూక్ష్మ, స్థూల పోషకాల గురించి వివరించారు. ఆధార్ శీల కార్యక్రమం ద్వారా 3 సంవత్సరాల నుండి 6 ఏళ్ళ పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించవలసిన పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టాటా ట్రస్ట్ ప్రతినిధి జునెద్, డాక్టర్ హేమలత, మహిళా యూనివర్సిటీ ప్రతినిధి వాణి, సూపర్‌వైజర్లు హేమావతి, శ్రీదేవి, మాధురి, పావని, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్యశాలలో స్తంభించిన ఓపీ,ఓటీలు



**12వ రోజుకు చేరిన వెటర్నరీ జూడాల సమ్మె**

**తిరుపతి విద్య ఫిబ్రవరి 14 ప్రభాతవార్త**

ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో జూడాల సమ్మె తారాస్థాయికి చేరింది. గౌరవవేతనాన్ని పెంచాలంటూ నిరవధిక నిరసన 12వరోజుకు చేరింది. సమ్మెలో భాగంగా శుక్రవారం వర్సిటీలో పశువైద్యశాలలో రెండవ రోజు అన్ని రకాల ఓపీలు,ఓటీలను వెటర్నరీ జూడాలు స్తంభింపజేశారు. దీంతో రైతులు,పెట్ యజమానులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు వైద్య విద్యార్థుల సమ్మెతో వైద్యశాల నుంచి వెనుదిరగాల్సి వచ్చింది. అలాగే నగరంలో తాతయ్య గుంట వద్దగల పశువైద్యశాలలో సైతం ఓపీలను జూడాలు స్తంభింపచేశారు. పశువైద్యశాల ఎదుట పెద్ద సంఖ్యలో యూజీ,పీజీ విద్యార్థులు స్టైఫండ్ పెంచాలని,న్యాయం చేసేవరకు సమ్మె విరమించమంటూ నినదిస్తూ బైటాయించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 12 రోజులుగా విధులు బహిష్కరించి న్యాయమైన డిమాండు కోసం పోరాడుతుంటే ప్రభుత్వం, వర్సిటీ అధికారులు స్పందించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూజీ విద్యార్థులకు రూ. 25వేలు,పీజీ విద్యార్థులకు రూ. 50వేలు, పీహెచ్ఎ విద్యార్థులకు రూ. 75వేలు గౌరవవేతనం ఇచ్చేవరకు సమ్మెను విరమించేది లేదని హెచ్చరించారు. ప్రజలు, రైతుల తమకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

## మహిళలు మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలి

**-వైద్యాదికారిణి డాక్టర్ లహరిణి**



**తొట్టంబేడు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** మహిళలు మామోగ్రామ్ పరీక్షలు చేయించుకోవాలని తొట్టంబేడు వైద్యాదికారి డాక్టర్ లహరిణి తెలిపారు. స్విమ్స్ ఆధ్వర్యంలో మండలంలోని బసవయ్య పాళెం, పెద్దకన్నలిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక దశలో రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించేందుకు 35ఏళ్ళు దాటిన మహిళలందరు మమోగ్రాం పరీక్ష చేయించుకోవాలని తొట్టంబేడు వైద్యాదికి లహరిణి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రినింగ్ వేగవంతంగా జరుగుతోందని, బిపి, షుగరు పరీక్షలతో పాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటిక్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మమోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చైతన్యభాను, డాక్టర్ పద్మావతి, సర్పంచ్‌లు టి.నాగమణి, ఎం.రమ, పంచాయతీ కార్యదర్శులు డి.మురళీ, స్థానిక నాయకులు కమల్‌కుమార్, నాదముని, రామమూర్తి, పిహెచ్ఎన్ సంపూర్ణ, సూపర్‌వైజర్ ధనమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు ఇందువదన, శక్తిప్రియ, ఎఎన్ఎంలు డిల్లీరాణి, సంధ్యారాణి స్థానిక వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్ భిపడాయిపై శిక్షణ



**తొట్టంబేడు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్‌బి. పడాయి భి పై శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా జిల్లా విద్యాశాఖాధికారి కెవిఎన్.కుమార్ హజరయ్యారు. డిఈఓ మాట్లాడుతూ పోషన్ భిపడాయి కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం ఆరు సంవత్సరాలు లోపు పిల్లలకు పోషణ మరియు విద్య ఎంతో ముఖ్యమని ఇందుకు కార్యకర్తలు నిబద్ధతతో పనిచేయాలని తెలిపారు. పిల్లలకు తొలి 1000 రోజులు ఎంతో ముఖ్యమని ఆసమయంలో వారి శారీరక అభివృద్ధి, మానసిక, సాంఘిక, సృజనాత్మకత, భాషాభివృద్ధి ఎంతో ముఖ్యమన్నారు. సిడిపిఓ శాంతిదుర్గ, డిప్యుటీ డిఈవో ప్రభాకర్‌రాజు, ఎంఈఓ భువనేశ్వరి, హెచ్‌ఎం రాజేశ్వరి, రీసోర్స్ పర్సన్‌గా హరిత, లక్ష్మిలు పాల్గొన్నారు.

## కూనాటి సురేష్‌కు ఎన్‌సిఈఆర్‌టి ప్రశంసాపత్రం



**శ్రీకాళహస్తి, జనవరి 14 ప్రభాతవార్త** ఊరందూరులో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కూనాటి సురేష్ జాతీయ విద్యాపరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన నిష్ఠ జాతీయ స్థాయి రీసోర్స్ పర్సన్‌ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని విద్యతో సాంకేతికత, ఇంటరాక్టివ్ ఉపకరణాల ఉపయోగం, సైబర్ నేరాల వలలో పడకుండా విద్యార్థులను రక్షించడం, అగ్యూమెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఎనర్జెంగ్ టెక్స్‌బుక్స్, విద్యార్థులలో 21వ శతాబ్ద నైపుణ్యాలను సాధించడం, సాంకేతిక మూల్యాంకన సాధనాలను రూపొందించడం, కాపీరైట్ చట్టాలు మరియు సోషల్ మీడియా వాడకం తదితర అంశాలలో శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనపరచిన సందర్భంగా జాయింట్ డైరెక్టర్ అమరేంద్ర బెహరా నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. ఎన్‌సిఈఆర్‌టి(సిఐఈటి) ప్రొపెసర్ డాక్టర్ ఏంజెల్, డాక్టర్ రాజ్వల్, ప్రొపెసర్ ఇందుకుమార్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి రీసోర్స్ పర్సన్‌లు,ప్రొపెసర్లుపాల్గొన్నారు. పలువురు ఉపాధ్యాయులు కూనాటి సురేష్‌ను అభినందించారు.

## ఎంపేడు గ్రామంలో హౌసింగ్ అక్రమాలపై విచారణ

**.శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త**



గత ప్రభుత్వంలో ఎంపేడు గ్రామంలో జరిగిన హౌసింగ్ అవకతవకలపై విచారణ కోసం ఈఈ శ్రీనివాసరావు, డిప్యుటీ ఈఈ మోహన్‌రావు మరియు సిబ్బంది విచ్చేశారు. గ్రామంలో తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి మరియు తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డిలు గ్రామస్తులతో కలసి లబ్దిదారులతో ఇంటింటికి వెళ్ళి విచారించగా చాలా వరకు పాత ఇండ్లకే బిల్లులు పెట్టి నిధులు స్వాహ్ చేసినట్లు మరియు లేని ఇండ్లకు వేరే వారి పేర్లు పెట్టి నిధులు స్వాహ్ చేసినట్లు లేని ఇండ్లకు మరో ఇళ్ళను జియో ట్యాగ్ చేసి ఆనిధులు కూడా గ్రామ వైసిపి నాయకులు స్వాహ్ చేసినట్లు లబ్దిదారులు తెలిపారు. విచారణ బృందం వివరణ మొత్తం తీసుకుని పిడికి నివేదిక అందిస్తామన్నారు. నిధులు స్వాహ్ చేసిన నాయకులపై కలెక్టర్ మరియు పిడి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు లబ్దిదారులు తెలిపారు.

## పాపానాయుడుపేటలో పోషణా భీపడాయి కార్యక్రమం



**శ్రీకాళహస్తిరూరల్(ఏర్పేడు), ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** పోషణా భీపడాయి కార్యక్రమంపై ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాపానాయుడుపేట క్లస్టర్‌కు సంబందించి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి పిల్లల పోషణ మరియు ప్రీస్కూల్ కార్యక్రమాల గురించి పిల్లలు పుట్టినప్పటి నుంచి వారిలో పోషకు లోపాలను అధిగమించి ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలి అన్న అంశాలపై సిడిపిఓ క్రిష్ణమంజరి వివరించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలు ఎదుగుదలను గుర్తించి వారికి పోషకాలతో కూడిన ఆహారం గురించి అవగాహన కలిగించి అందరు పిల్లలు తల్లులకు పౌష్టిక ఆహారం గురించి అవగాహన కలిగించి అందరు పిల్లలు ఆరోగ్యంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లపై ఉందన్నారు. శ్రీకాళహస్తిలో జరిగే శివపార్వతుల కళ్యాణ మహోత్సవం రోజున బాల్య వివాహాలను జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, ప్రగతి సిబ్బంది సుమలత, మరియు ఏర్పేడు మండల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేటెంట్ హక్కులపై ముగిసిన జాతీయ సదస్సు

**తిరుపతి విద్య, ఫిబ్రవరి 14 ప్రభాత వార్త**



పద్మావతి మహిళా వర్సిటీ సావేరీ సెమినార్ హాల్ వేదికగా పేటెంట్ అప్లికేషన్ డ్రాఫ్టింగ్ అండ్ ఫైలింగ్ విధానాలపై గత ఐదురోజులుగా జరిగిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా ఎన్ఐ ఎమ్ఎస్ఎమ్ఎ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరీ స్వరూప, ఎన్ఆర్డీసీ హెడ్ డాక్టర్ బిజాయ్ కుమార్,ఐఐటీ చెన్నైకి చెందిన డాక్టర్ దారా అజయ్ పాల్గొని పరిశోధనలకు,ఆవిష్కరణలకు పేటెంట్ హక్కుల ప్రాధాన్యతపై వివరించారు. అనంతరం అతిథులను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజినిని మర్యాద పూర్వకంగా కలసి సదస్సుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజర్ ప్రొఫెసర్ డీఎం మమత,అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ప్రతిభావంతులను చిన్నతనంలోనే గుర్తించాలి: కృష్ణ మంజరి

**రేణిగుంట ఫిబ్రవరి 14 ప్రభాతవార్త**



ప్రత్యేక ప్రతిభావంతులను చిన్నతనంలోనే గుర్తించి వారికి తగిన వైద్యం చేయిస్తే వైకల్యం తగ్గించే అవకాశం ఉంటుందని సిడిపిఓ కృష్ణ మంజరి అన్నారు. రేణిగుంట బాలికల ప్లస్ టు ఉన్నత పాఠశాలలో శుక్రవారం పోషణ బి పడయిబి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది. కార్యక్రమం నందు అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో పోషణ, ప్రీస్కూల్ పై అవగాహన కల్పిస్తారు. ముఖ్యంగా దివ్యాంగులకు కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చెవుడు, ఒక కంటిలో దృష్టిలోపం గుర్తించడం కష్టమన్నారు. కొంతమంది మెలకన్ను అదృష్టంగా భావిస్తారని తెలిపారు. అయితే మెల్లకన్ను అంతత్వానికి నిదర్శనం అన్నారు. చెవుడును చిన్నతనంలో గుర్తిస్తే చెవులకు వినికిడి యంత్రాన్ని అమర్చి చెవుడు మూగ రాకుండా జాగ్రత్త పొడవుతున్నారు. అలాగే మెల్ల కంటిని చిన్నప్పుడే తెలుసుకొని శస్త్ర చికిత్స చేస్తే అంతత్వం రాదన్నారు. పుట్టిన బిడ్డను పుట్టినప్పటి నుండి పరిశీలించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వాళ్లు ఎదిగి వాళ్ళకై వాళ్లు చెప్పే వరకు సమస్యను గుర్తించకపోవడం తల్లిదండ్రులు తప్పని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ హేమావతి, ప్రగతి కోఆర్డినేటర్ జయలక్ష్మి, సి ఓ సురేష్, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై వచ్చిన నిరాధార ఆరోపణలను ఖండించిన ఉపాధ్యాయులు



**పిచ్చాటూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** సామాజికమాధ్యమాల్లో ఎమ్మెల్యేపై వచ్చిన అసభ్యకర నిరాధారమైన ఆరోపణల్లో గౌరవప్రదంగా ఉద్యోగాలు చేసుకుంటున్న ఉద్యోగులు, అధికారులపై స్త్రీ వ్యక్తిత్వాన్ని హననం చేసే విధంగా వచ్చిన వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నామని పిచ్చాటూరు మండలంలోని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిచ్చాటూరు మండల విద్యా వ్యవస్థను రాష్ట్ర స్థాయి వరకుప్రథమ స్థానంలో నిలిచేటట్లు చేసి, జాతీయ సాహితి, సేవానంది అవార్డు గ్రహిత, ఎన్నో జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు వరించాయన్నారు. పాఠశాల మౌలిక వసతుల కల్పన నాడు-నేడు పాఠశాల విషయంలో కూడా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి, సీఎస్‌సీ సైట్‌లో కూడా పిచ్చాటూరు పాఠశాల ముఖ చిత్రం ఉండడం గమనార్హం. కైవల్య ఫౌండేషన్ సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ ఆ నాటి గౌరవ కమిషనర్ సంధ్యారాణి ఆదేశాల ప్రకారం రాష్ట్ర విద్యాశాఖ తరపున ఎడ్యుకేషన్ రీ ఫార్మ్స్ కార్యక్రమంలో కీలక ప్రాతినిధ్యం వహించారు. అంతేకాకుండాజానపద నృత్య పోటీల్లో విద్యార్థులను జాతీయ స్థాయికి తీసుకెళ్లారని తెలిపారు. అటువంటి నిరంతరం కృషి, పట్టుదల, నిజాయితీకి మారుపేరుగా వృత్తి పరమావధిగా భావిస్తున్న మండల విద్యాశాఖ అధికారిని ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ హిందీ మేడం పేరుని కూడా ఈ 50 మందిలో చేర్చడం ఒక గౌరవ స్థానంలో ఉన్న మహిళా ఉద్యోగులపై ఇటువంటి నిరాధార ఆరోపణలు చేయడం, సభ్య సమాజం తలదించుకునేలా హేయమైన పిరికి పంద చర్యగా భావిస్తున్నామన్నారు. ఇది మహిళా హక్కులను ఔన్నత్యాన్ని భంగం కలిగించేటట్లుగా ఉంది. ఈ విధంగా చేసి విద్యాశాఖను అప్రతిష్టాపాలు చేస్తూ తెర వెనుక ఉండి,నడిపిస్తున్న వారిని తెర ముందుకు తీసుకురావాలని నిజాలను నిగ్గు తేల్చవలసిన అవసరం ఎంతైనా ఉందని ముక్తకంఠంతో కోరి ప్రార్ధిస్తున్నాం. అనంతరం ఉన్నత స్థాయి అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన శ్రీ కావమ్మ మారయ్య తిరుణాళ్ళ



**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో వెలసిన శ్రీ కావమ్మ మారయ్య దేవాలయంలో తిరుణాళ్ల శుక్రవారంతో ముగిసింది. మూడు రోజుల పాటు నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అలంకరణలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలతో అలంకరించి విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ మూడు రోజులు ఆలయ ఆవరణలో బుర్ర కథ కార్యక్రమం చేపట్టారు. ఆలయ ఆవరణలో మహిళలు అధిక సంఖ్యలో హాజరై పొంగళ్ల పెట్టి స్వామి, అమ్మవార్లకు నివేదన చేశారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి, అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## గ్రామీణ పర్యాటకం అభివృద్ధి చెందాలి.

**తిరుపతి విద్య ఫిబ్రవరి 14 ప్రభాత వార్త**



గ్రామీణ పర్యాటకరంగం అభివృద్ధి చెందితేనే గ్రామీణ ప్రాంతాలలో జీవనోపాధి మెరుగుపడుతుందని మాజీ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ లక్ష్మమ్మ అభిప్రాయపడ్డారు. పద్మావతి మహిళా వర్సిటీ ఆర్థికశాస్త్ర విభాగం,మహిళా అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ పర్యాటకం,సుస్థిర గ్రామీణ జీవనోపాధి అనే అంశపై రెండు రోజుల జాతీయ సదస్సు మహిళా వర్సిటీలో శుక్రవారం ప్రారంభమైంది. ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి గ్రామీణ పర్యాటకం అభివృద్ధి, సుస్థిరత సాంస్కృతిక పర్యాటకం,స్థానిక వనరులు, వినియోగం వంటి కీలక అంశాలపై విశ్లేషణాత్మకంగా వివరించారు. అనంతరం ఏపీ టూరిజం అథారిటీ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రమణ ప్రసాద్ మాట్లాడుతూ విద్యాసంస్థలు, అధ్యాపకులు,విద్యార్థులు గ్రామీణ పర్యాటకాన్ని ప్రోత్సహించాల్సి అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ వర్సిటీ ప్రొఫెసర్ బి సురేష్, పాండిచ్చేరి వర్సిటీ ప్రొఫెసర్ పై వెంకటరావు, హెడ్ డాక్టర్ నీరజ,డాక్టర్ పి మాధవి, పరిశోధకులు,విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## జ్ఞానాన్ని పెంచే గ్రంథాలపై రచయితలు దృష్టి సారించాలి

**తిరుపతి విద్య ఫిబ్రవరి 14 ప్రభాత వార్త**



జ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాల రచనలపై రచయితలు దృష్టి సారించాలని యూజీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అర్చనా ఠాకూర్ పిలుపునిచ్చారు. భారతీయ భాషలో యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్,భారతీయ భాషా సమితి,న్యూఢిల్లీ కేంద్రీయ సంస్కృత వర్సిటీ,జాతీయ సంస్కృత వర్సిటీ సంయుక్తాధ్వర్యంలో రెండు రోజులపాటు వివిధ హైయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్స్ భారతీయ భాషల పుస్తక రచయితల సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యశాలనుద్దేశించి ప్రసంగించారు. ఉన్నత విద్యలో భారతీయ జ్ఞానాన్ని విద్యార్థులకు అందించేలా సబ్జెక్టులు,గ్రంథాలు ఉండాలన్నారు. రచించే గ్రంథాలు భావిభారతానికి ప్రతీకలుగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ కే వెంకటనారాయణరావు, డాక్టర్ సూర్యప్రసాద్,ప్రొఫెసర్ కే గిరిధరరావు,డీన్ దక్షణమూర్తిశర్మ, ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి,డాక్టర్ శేఖర్రెడ్డి,దేశంలోని పలు రాష్ట్రాల నుంచి సుమారు 50మందిన రచయితలు వర్క్షాపులో పాల్గొన్నారు.

## మేధోశక్తి మెరుగుకు మెడిటేషన్ అవసరం

**తిరుపతి విద్య ఫిబ్రవరి 14 ప్రభాత వార్త**



విద్యార్థులు మేధోశక్తిని యోగా,మెడిటేషన్ తో మెరుగుపరచుకోవచ్చని ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి సత్యనారాయణ పేర్కొన్నారు. టీటీడీ అధికారులు ఆదేశాల మేరకు శుక్రవారం మహర్షి వేదిక్ వర్సిటీ టీమ్ ఆధ్వర్యంలో ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాలలో యోగా,మెడిటేషన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యోగా,మెడిటేషన్ ను దినచర్యలో భాగం చేసుకోవాలని,దీంతో జ్ఞాపకశక్తి పెరుగుదలతో పాటు విద్యపై ఆశక్తి పెరుగుతుందన్నారు. మానసిక ఒత్తిడి తగ్గి చక్కటి ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జానకి, వరలక్ష్మి,చంద్రయ్య, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రాకేష్ కుటుంబానికి నారా లోకేష్ ఆత్మీయ పలకరింపు

**చంద్రగిరి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** కందులవారిపల్లి ఉప సర్పంచ్, టిడిపి నాయకుడు రాకేష్ చౌదరి కుటుంబ సభ్యులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆత్మీయంగా పలకరించారు. ఏనుగుల దాడిలో మరణించిన రాకేష్ భార్య పిల్లలు, కుటుంబ సభ్యులతో శుక్రవారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా చిన్నారి రాకేష్ కుమార్తెను ముద్దాడి ఎత్తుకున్నారు. బాధిత కుటుంబ స్థితిగతులను అడిగితెలుసుకున్నారు. కందులవారిపల్లి, భీమవరం ఈ ప్రాంతంలో టిడిపి ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ పటిష్టతకు రాకేష్ చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. మీ కుటుంబానికి అన్నివిధాలుగా అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు.



## ప్రాంగణ ఎంపికలో సెవెన్ హిల్స్ విద్యార్థుల ప్రతిభ



**రామచంద్రాపురం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాల విద్యార్థులు ప్రాంగణ ఎంపికలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్‌బాబు అన్నారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో అపోలో ఫార్మశీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు జగదీష్, శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో 120 మంది విద్యార్థులకు వ్రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వీరిలో 95 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.1.8 లక్షలు లభిస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ ఎం.సుమలత, కళాశాల సిబ్బంది అభినందించారు.

# తిరుపతి డివిజన్

## ఈ-శ్రమ్ పోర్టల్‌తో సామాజిక భద్రత-సంక్షేమ పథకాలు అమలు

**-ఫీల్డ్ అసిస్టెంట్లు ఈ-శ్రమ్ పోర్టల్ నమోదులో భాగస్వామ్యం**



**తిరుపతిరూరల్, ఫిబ్రవరి14 ప్రభాతవార్త:** ప్రతి అసంఘిటిత కార్మికుడు తన వివరాలను ఈ-శ్రమ్ పోర్టల్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తిరుపతిరూరల్ ఎంపిడిఓ రామచంద్ర, కార్మికశాఖ సహాయ కమీషనర్ చినలాలప్ప తెలిపారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవడం వల్ల వారికి సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అమలు అవుతాయని తెలిపారు. అసంఘిత రంగంలో పనిచేసే కార్మికులే కాకుండా వారి కుటుంబ సభ్యులు కూడా ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. శుక్రవారం తిరుపతిరూరల్ ఎంపిడిఓ సమావేశమందిరములో ఈ-శ్రమ్ పోర్టల్‌పై పంచాయతీ కార్యధర్శులు, ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**ఈ-శ్రమ్ పథకం ఉద్దేశము** కరోనా విపత్కర పరిస్థితులలో అసంఘిటిత రంగ కార్మికులు, వలస కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు వర్తింపే లక్ష్యంగా సుప్రీమ్ కోర్టుఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ పోర్టల్‌ను 16-08-2021న ప్రవేశపెట్టిందని తెలిపారు.

**వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ** ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన వలస కార్మికులు తమ స్వంత రాష్ట్రంలో కానీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గానీ ఎక్కడ కూడా రేషన్ కార్డు పొందనట్లయితే వారికి పౌరసరఫరాల శాఖ ద్వారా రేషన్‌కార్డులు జారీ చేస్తారని తెలిపారు.

**ఈ-శ్రమ్ పోర్టల్ పథకానికి అర్హులు** ఈ ప్రక్రియకు వయస్సు పరిమితి 16-59 సంవత్సరాల వయస్కులు, ఆధాయపు పన్ను చెల్లించనివాళ్ళు, పిఎఫ్, ఈఎస్ఐ సదుపాయం లేనివాళ్ళు నెలకు రూ.15వేల రుపాయాలు లోపు జీతం తీసుకునేవాళ్ళు ఈ పథకానికి అర్హులని తెలిపారు.

**ఈ-శ్రమ్ పోర్టల్ నమోదు ప్రక్రియకు** అసంఘిత కార్మికుని ఆధార్ నెంబర్, ఆధార్‌తో లింకైన మొబైల్ నెంబర్, బ్యాంకు అకౌంట్ వివరాలు ఉంటే ఈ పథకంలో చేరవచ్చునని తెలిపారు. ఈ-శ్రమ్ పోర్టల్ నమోదు ప్రక్రియ సచివాలయం, సిఎస్‌సి సెంటర్, మీ-సేవా కేంద్రం ద్వారాగానీ నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. మొబైల్ ఫోన్ ద్వారా సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకునే సదుపాయం చేసుకోవచ్చునని తెలిపారు.

**ఈ-శ్రమ్ పోర్టల్ ప్రయోజనాలు** ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న అసంఘిత కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2లక్షల రుపాయాల ప్రమాద భీమా, అంగవైకల్యం జరిగిన భీమా వర్తిస్తుందని తెలిపారు. పాక్షిక అంగవైకల్యం కలిగితే రూ.1లక్ష వరకు ఆర్థిక సహాయం పొందవచ్చు అన్నారు. ఇతర వివరాలకు 9492555219 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మికశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్, మండల విద్యాధికారులు, ఎపిఓ మమత తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవకు రారండి:

**సినీనటుడు నితిన్‌కు ఆహ్వానం**



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అతిధులు, సినీనటులకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి వారం రోజులుగా ఆహ్వానిస్తున్నారు. మూడు రోజుల పాటు ఢిల్లీలో తిష్టవేసి కేంద్ర మంత్రులు విఐపిలను ఆహ్వానించిన ఆయన శుక్రవారం హైదరాబాదులో పలువురిని కలసి ఆహ్వానించారు. సినీనటులు నితిన్ ఇంటి వద్ద కలసి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రికను అందించారు. ఆయనకు శివయ్య ప్రసాదాలతో పాటు శివయ్య శాలువతో సత్కరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తీశ్వరాలయం గుడిమల్లం పరశురామేశ్వరాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. కాగా టిటిడి ధర్మకర్తల మండలి చైర్మెన్ బిఆర్ నాయుడును ఆహ్వానించారు.

## కోటమ్మకు హరతి దీపాలు వితరణ



**శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండలంలోని అక్కుర్తి సమీపంలో వెలసిన కోటలోని కోటమ్మ అమ్మవారి దేవస్థానానికి భక్తులు హరతి దీపాలను వితరణగా శుక్రవారం బహూకరించారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మహేష్‌లేత్ వర్క్స్ అధినేత సింగం శెట్టి విజయకుమార్,విజయలక్ష్మీ దంపతులచే బహూకరించారు. 36,27,27,18 పైభాగంలో 'ఓం' అనే అక్షరంతో తయారు చేయబడిన హారతి దీపాలను ఆలయ ధర్మకర్త నల్లపురెడ్డి జగన్మోహన్‌రెడ్డికి అందించారు. వారికి ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపిప్రసాదాలను అందించారు. ఇలాంటి హారతి దీపాలనే కోటలోని శివాలయం, కనుపూరులోని ముత్యాలమ్మ అమ్మవారికి గుడిమల్లంలోని పరశురా మేశ్వరాలయానికి శ్రీకాళహస్తీశ్వరాలయంలోని స్వామి అమ్మవార్లకు ఈ నెల 17న అందించుటకు సిద్దం చేసినట్లు వివరించారు.

## వైదిక ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి.



**తిరుపతి విద్య ఫిబ్రవరి 14 ప్రభాత వార్త** వేదిక్ వర్సిటీ విద్యార్థులు వేద ప్రచారం,వైదిక దర్మ పరిరక్షణకు కృషి చేయాలని ఢిల్లీ అక్షరధామ్ నారాయణ సంస్థాన్కు చెందిన మహామహోపాధ్యాయ ఈట భద్రేష్ దాస్ స్వామీజి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన వేదిక్ వర్సిటీలో పర్యటించి పలు విభాగాలను సందర్శించారు. వీసీ రాణి సదాశివమూర్తి ఆయనకు స్వాగతం పలికి వర్సిటీలో జరుగున్న అభివృద్ధి, విద్యావిధానాన్ని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్సిటీ విద్యార్థులు చేసిన చతుర్వేద మంత్రపఠనం శ్రవణానందంగా ఉందని కొనియాడారు. డిల్లీలో అక్షరధామాన్ని సందర్శించాలని కోరారు. వేద పఠనం చేస్తున్న విద్యార్థులు సమాజసేవకు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. వేద సంకల్ప విదయను విద్యార్థులు పాటించి వేద సంరక్షణకు కృషిచేయాలన్నారు. అనంతరం వర్సిటీలోని భూమిని సందర్శించి అక్కడ మట్టిని స్వీకరించి తిలకధారణ గావించారు. ఈ కార్యక్రమంలో డీన్స్ గోళి సుబ్రహ్మణ్య శర్మ, అధ్యాపకులు,తారక రామశర్మ,రాజేష్,పవన్, ఉమేష్,బ్రహ్మచార్యులు పాల్గొన్నారు.

## పీరియడ్స్ సమయంలో జాగ్రత్త వహించాలి...




**రేణిగుంట ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** మహిళలు పీరియడ్స్ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెన్నై ఫెమి9 రుతు సంబంధ పరిశుభ్రత అధ్యాపకులు ప్రముఖ వ్యాపారవేత్తలు అనంత్, జయశ్రీ సంయుక్తంగా అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ వెంకటాపురం సమీపంలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఐ క్యు ఏసి, ఉమెన్ డెవలప్మెంట్ సెల్ ఆధ్వర్యంలో పీరియడ్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ మహిళలు పీరియడ్స్ సమయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో ఉండాలన్నారు. పోషకాహారాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రక్తలేమి లేకుండా జాగ్రత్తపడాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదముడు రెడ్డి, కళాశాల వివిధ విభాగాధిపతులు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ రమ్య, ఉమెన్ డెవలప్మెంట్ సెల్ కన్వీనర్ పుష్పలత, సునీత, లావణ్య, పాల్గొన్నారు. మహిళలకు ఉపయోగపడే కార్యక్రమాన్ని నిర్వహించినందుకు కళాశాల సిబ్బందిని అన్నమాచార్య విద్యాసంస్థల చైర్మన్ గంగిరెడ్డి అభినందించారు.

## ప్రతి రైతు ఫార్మర్ రిజిష్ట్రీలో నమోదు

**వడమాలపేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:**

భూమి కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిష్ట్రీలో నమోదు చేసుకోవాలని వడమాలపేట వ్యవసా యశాఖ అధికారి విజయ కుమార్ తెలిపారు. మండ లంలోని ఎస్‌బీ ఆర్ పురం గ్రామంలో శుక్రవారం రైతులకు ఫార్మర్ రిజిష్ట్రీలో విశిష్ట డీజిటల్ గుర్తింపు కార్డు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమం సర్పంచ్ ఆర్. మణి రాజు ప్రారంభించారు. ఈ విశిష్ట డిజిటల్ గుర్తింపు కార్డు కొరకు రైతులను సమావేశపరచి వారికి గుర్తింపు సంఖ్య పొందడం ద్వారా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ, పీఎం కిసాన్,అన్నదాత సుఖీభవ, ఇతర వ్యవసాయ సంబంధిత పథకాలు పొందడానికి వీలవుతుందని వివరించి కార్డు నమోదు కొరకు రైతుల నుంచి వివరాలను సేకరించి ఫోన్ ద్వారా వచ్చిన మెసెజ్‌లోని నెంబరును భద్రపర చమని తెలియజేశారు.


కెనరా బ్యాంక్ | केनरा बैंक | Canara Bank

Together we can

తిరుపతి భవాని నగర్ శాఖ, తిరుపతి

**స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002లోని రూల్3 తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగించు కుంటూ కెనరా బ్యాంకు వారి యొక్క అధీకృత అధికారిగా ఉన్న దిగువ సంతకందారు నోటీసులో తెలిపిన మొత్తం రూ.50,48,816.44పై (యాభై లక్షల నలభై ఎనిమిది వేల ఎనిమిది వందల పదహారు రూపాయల నలభై నాలుగు పైసలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులను సదరు నోటీసు అందుకున్న తేది నుంచి 60 రోజుల్లో తిరిగి చెల్లించవలసినదిగా రుణగ్రహీత శ్రీ ఎం.రమేష్ తండ్రి ఎం.లక్ష్మయ్యగారిని కోరుతూ 16.11.2024 వ తేదీ గల డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

రుణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, దిగువ సంతకందారు సదరు చట్టంలోని నిబంధన 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ తెలిపిన ఆస్తిని 11.02.2025 వ తేదీన స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు, హామీదారులకు, సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సెక్షన్ 13 సబ్‌సెక్షన్(8) క్రింద సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందేందుకు సమయం ఇవ్వడమైనదని రుణగ్రహీతలకు తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఏ వ్యవహారం జరుపరాదని, ముఖ్యంగా రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో ఏవేని వ్యవహారాలు జరుపదలిస్తే కెనరా బ్యాంకు వారికి తేది: 16.11.2024 నాటికి రూ.50,48,816.44పై (యాభై లక్షల నలభై ఎనిమిది వేల ఎనిమిది వందల పదహారు రూపాయల నలభై నాలుగు పైసలు మాత్రమే)మరియు దానిపై వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొదలైనవి చెల్లించుటకు లోబడి ఆ విధంగా చేయవచ్చును.

**స్థిరాస్తి వివరణ**

చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి రూరల్ సబ్‌జిల్లా, తిరుపతి రూరల్ మండలం, బ్రాహ్మణపట్టు పంచాయతీ నెం.12, వేమూరు గ్రూపు, నెం.13 బ్రాహ్మణపట్టు గ్రామరెవెన్యూ సర్వేనెం.237/2, 237/2బి & 237/2సి లో వేసిన "టెంపుల్ సిటీ లేఅవుట్"లోని ప్లాటు నెం.67 విస్తీర్ణం 2400 చ.అ. లేదా 266.66 చ.గ. లేదా 66.66 అంకణములు. హద్దులు: తూర్పు: ప్లాటు నెం.66 లోని స్థలం, పడమర: ప్లాటు నెం.68 లోని స్థలం, ఉత్తరం: 40అ. వెడల్పు గల రోడ్డు, దక్షిణం: ప్లాటు నెం.71లోని స్థలం, ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 40అ. లేదా 12.200 మీ. ఉత్తరం నుండి దక్షిణం:60 అ. లేదా 18.300మీ.

స్థలం : తిరుపతి తేది: 11.02.2025 సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

# నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో...ప్రపంచ రేడియో దినోత్సవం



గూడూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : నారాయణ ఇంజనీరింగ్ కళాశాల గూడూరులో ప్రపంచ రేడియో దినోత్సవం నిర్వాహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాము నెల్లూరు రెడ్ ఎఫ్ఎమ్ విభాగం అధిపతిగా ఆర్ జేబీఎంకే ఆర్జే బాను పాల్గొన్నారు. రాము మాట్లాడుతూ ప్రపంచ రేడియో దినోత్సవం, ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 13న జరుపుకుంటారు. రేడియో దినోత్సవం 2025 యొక్క థీమ్ రేడియో వాతావరణ మార్పు ఈ థీమ్ వాతావరణ మార్పుల గురించి కీలకమైన సమాచారాన్ని వ్యాప్తి చేయడం, పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించడంలో రేడియో పాత్రను నొక్కి చెబుతుంది. ప్రపంచ రేడియో దినోత్సవం ప్రాముఖ్యత ప్రపంచ రేడియో దినోత్సవం వైవిధ్యాన్ని ప్రోత్సహించడంలో, సంభాషణను ప్రోత్సహించడంలో ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులో ఉండే సమాచారాన్ని అందించడంలో రేడియో శక్తిని హైలైట్ చేస్తుంది. కమ్యూనిటీలలో చేరడానికి ప్రతి చోటా ప్రజల గొంతులను గుర్తించడానికి రేడియో చాలా బాధ్యత వహిస్తుందని మనకు గుర్తుచేస్తుంది. రెడ్ ఎఫ్ఎమ్ బృందం ఆర్జేబీఎంకే, ఆర్జే బాను విద్యార్థులకి రేడియో ప్రసారాలు: ప్రత్యేక కార్యక్రమాలు, ఇంటర్వ్యూలు, చర్చలు రేడియో ప్రాముఖ్యతను తెలియజేస్తాయి. వర్క్షాప్లు సెమినార్లు: ఈవెంట్లు రేడియో భవిష్యత్తును, సాంకేతిక పురోగతిని, దాని సామాజిక ప్రభావాన్ని అన్వేషిస్తాయి. కమ్యూనిటీ ఎంగేజ్మెంట్, స్థానిక రేడియో స్టేషన్ల పోటీలు, కాల్ఇన్లు మరియు ఇంటరాక్టివ్ సెషన్ల ద్వారా ప్రేక్షకులను నిమగ్నం చేస్తాయి. ఈ కార్యక్రమం నందు పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. రవిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డా. జె వి భాస్కర్, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ వై.నీరజ ఈ ఈవెంట్ గురించి విద్యార్థులకు మరికొన్ని విషయాల గురించి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, ఈవెంట్ కో ఆర్డినేటర్ యం.దివ్య వాణి, ఏట కొండారెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ఆరోగ్యం కోసం వ్యాయామం అవసరం : సిఐ



వెంకటగిరి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని సిఐ ఏవి రమణ తెలిపారు. వెంకటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి సిబ్బందికి పెరేడ్ నిర్వహిం చారు. తమ సిబ్బందికి ప్రతి శుక్రవారం జిల్లా ఎస్పీ సూచన మేరకు వ్యాయామం చేస్తున్నట్లు తెలిపారు. ఫిట్నెస్ కోసం యోగా, రన్నింగ్ వంటివి నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎస్పీ సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వారి వారి చేత వ్యాయామం చేస్తున్నట్లు చెప్పారు. సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు.. ఎస్సైలు సుబ్బారావు, కామినేని గోపి, లక్ష్మి భవాని తదితరులు పాల్గొన్నారు.

## షాపులు గీత కార్మికులకు కేటాయించడం హర్షణీయం



గూడూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : జిల్లా గౌడ సంక్షేమ సంఘం నాయకులు రాష్ట్రంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా కల్లు గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 రిజర్వేషన్లు కేటాయించి అమలపరిచిన కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శ్రీ బాలాజీ తిరుపతి జిల్లా గౌడ సంక్షేమ సంఘం నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం శ్రీ బాలాజీ తిరుపతి జిల్లా పరిధిలోని గూడూరులో 28 గౌడ కుటుంబీకులతో కలిసి ఏర్పాటు చేసుకున్న మద్యం షాపును స్థానిక దూడల కాలవ వద్ద ఆర్భాటంగా గౌడ సంఘీయుల సమక్షంలో ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీ బాలాజీ తిరుపతి జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుసినేని రాజశేఖర్ గౌడ్ ఉపాధ్యక్షులు కేతే నారాయణ స్వామి గౌడ్, లీగల్ అడ్వైజర్ ఉదయగిరి మోహన్ గౌడ్, నాయకులు తిరకాల పురుషోత్తం గౌడ్, బాలాజీ తిరుపతి జిల్లా గౌడ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు, శ్రీ తాళమ్మ ఆలయ కమిటీ చైర్మన్ చిట్టెం శ్రీనివాసులు గౌడ్, గౌడ పెద్దలు చొప్పనాటి శ్రీనివాసులు గౌడ్ , శ్రీరాములు గౌడ్, రావుల అంకయ్య గౌడ్, తదితరులు ఉన్నారు.

## బెల్ట్ షాపులో...
## 11 మద్యం బాటిల్స్ పట్టివేత



వాకాడు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : ఎక్సైజ్ స్టేషన్ పరిధి లోని కర్లపూడి గ్రామంలో శుక్రవారం బెల్ట్షాప్ నిర్వాహకుడు వద్ద 11 మద్యం బాటిల్స్ ను వాకాడు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ ప్రసాద్ మాట్లాడుతూ సమా చారం మేరకు గూడూరు టీంతో కలిసి కోట మండలం కర్లపూడి గ్రామంలోని అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న కర్లపూడి ప్రభాకర్ అనే వ్యక్తి వద్ద 11 మద్యం బాటిల్స్ను పట్టుకోవడం జరిగిందన్నారు, కేసు నమోదు చేసి ప్రభాకర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సిసిఐ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ రాజయ్య, రాధాకృష్ణ, కానిస్టేబుల్స్ భాస్కర్, పి వెంకటేశ్వర్లు, జయ చంద్ర తదితరులు ఉన్నారు.

## అద్దె చెల్లించని దుకాణాలకు సీల్ వేసిన కమిషనర్

నాయుడుపేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని అద్దె చెల్లించని మున్సిపల్ దుకాణాలకు సీల్ వేసినట్లు మున్సిపాల్టీ కమిషనర్ పజులుల్లా శుక్రవారం తెలిపారు. ఈసందర్బంగా కమిషనర్ మాట్లడుతూ నాయుడుపేట పట్టణంలో ఉన్న మున్సిపాల్టీ దుకాణాలకు కొంతమంది దుకాణా దారులు గత 9నెలల నుండి అద్దె చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలియజేశారు. దుకాణాదారులకు పలు ధపాలుగా నోటీసులు జారీచేసిన వారినుండి ఏలాంటి స్పందన లేకపోవడంతో దుకాణాలకు సీల్ వేసినట్లు ఆయన తెలిపారు. బకాయిలు ఉన్న దుకాణాదారులు త్వరగా అద్దె చెల్లించాలని, లేకుంటే వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు.

## కదిలిన కుంభమేళా మూడవ బస్సు



తిరుపతి(రవాణ), ఫిబ్రవరి 14ప్రభాతవార్త: ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాకు తిరుపతి నుండి భక్తులను తీసుకెళ్ళడంలో ఆర్టీసి సేవలందిస్తోంది. మూడవ బస్సును శుక్రవారం సాయంత్రం తిరుపతిలో డిపిటిఓ నరసింహులు, డిప్యూటీ సిటిఎం విశ్వనాథ్, తిరుపతి మేనేజర్ బాలాజీ తిరుపతి బస్టాండు నుండి కుంభమేళా బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ప్రయాణీకులకు సురక్షిత ప్రయాణం ఆర్టీసితోనేనని డిపిటిఓ నరసింహులు తెలిపారు.

## ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని ఫిర్యాదు



వెంకటగిరి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను కొందరు అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకుంటున్నారని వైసీపీ నేత, 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. తాడేపల్లి లోనే మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి నివాస గృహంలో నియోజకవర్గ ఇంచార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డితో కలిసి ఆయన ఫిర్యాదు చేశారు. పట్టణంలోని లేఔట్‌లో ఉన్న ప్రజా అవసరాల స్థలాలను దురాక్రమణను చేస్తున్నట్లు తెలిపారు.

## దర్జీలకు శిక్షణా సర్టిఫికేట్లు ప్రదానం



చిల్లకూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : జిందాల్ సింహపురి యూనిట్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద 75రోజుల పాటు నిర్వహించిన దర్జీ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న 37 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ మురళి, కెనరా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ మోహన్, జిందాల్ సింహపురి యూనిట్ ప్లాంట్ హెడ్ కె. శ్రీనివాసరావు పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అదనంగా, బ్యాంకుల ద్వారా లభించే ముఖ్యమైన పథకాలు, ప్రభుత్వ సహాయాల గురించి ఈ కార్యక్రమంలో వివరించారు.

## అల్లంపాడులో పారదర్శకంగా రీసర్వే పూర్తి

కోట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : కోట మండలం అల్లంపాడు గ్రామాన్ని ప్రభుత్వం రీసర్వే కింద పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని తహశీల్దార్ కె.జయజయ రావు చెప్పారు. శుక్రవారం కోట తహశీల్దార్ కార్యాల యంలో సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో 822 ఎకరాల 38 సెంట్లు సర్వేను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో 201 ఎకరా ప్రభుత్వ భూమి ఉందన్నారు. అనంతరం రైతులకు నోటీసులు ఇచ్చి ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సరి చేస్తామని తెలిపారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ రీ సర్వేను బృందాలవారీగా సర్వేయర్లు పూర్తి చేశారని చెప్పారు. సర్వేయర్లకు సూచనలు, సలహాలు ఇచ్చి సందేహాలు నివృత్తి చేశారు. ఈ సమావేశంలో మండల సర్వేయర్ గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బడిలో భాషల పండగ

కోట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : ఈ నెల 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని కోట మండలంలోని ఉన్నత పాఠశాలల్లో భాషల పండుగ నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి డి.మస్తానయ్య చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆయా ఉన్నత పాఠశాలల్లో పఠనం, పొట్టి కథలు చెప్పడం, రాయడం, చర్చ, వక్తృత్వం, ఉపన్యాసం, సెల్ఫ్‌చెక్, రోల్స్‌ప్లే, బోధన పరికరాలు తయారీ వంటి అంశాలపై పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. మాతృభాష ప్రాధాన్యత వివరించడం జరుగుతుందన్నారు.

## పిఎం సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం

కోట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : సౌరవిద్యుత్ ఉత్పత్తి వినియోగాన్ని పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. అందులో భాగంగా పిఎం సూర్య ఘర్ పథకం ద్వారా ఇంటింటా సౌర పలకలు ఏర్పాటు చేస్తామని చెండోడు సబ్‌స్టేషన్ ఏడి చిన్నయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళుతు న్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సౌర పలకలు ఏర్పాటు చేసుకునే వారికి పూర్తిగా ఉచితంగా కనెక్షన్లు ఇస్తామన్నారు. దీనికయ్యే ఖర్చు, కేంద్రం ఇచ్చే రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని రాష్ట్రప్రభుత్వం భరిస్తుందన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో పిఎం సూర్య ఘర్‌పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

## ప్రాణ త్యాగం చేసిన సైనికులను స్మరించుకోవాలి

**-ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరక్టర్ డా. విజయకుమార్ రెడ్డి**



కోట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : దేశ సేవలో ప్రాణత్యాగం చేసిన భారత సైనికులను ప్రతి భారతీయ పౌరుడు స్మరించుకోవాల్సిన అవసరం ఉందని ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టి. డైరెక్టర్, డాక్టర్. వి. విజయ కుమార్ అన్నారు. శుక్రవారం విద్యా నగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టిలో అమరుల చిత్ర పటాలకు నివాళ్ళించారు. ఈ సందర్బంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2019 ఫిభ్రవరి 14న జమ్మూ కాశ్మీర్‌లోలోని పుల్వామా వద్ద పాకిస్తాన్ ఆత్మహతి దాడిలో భారత్ సైన్యం 40 మంది మృతి చెందారని ఆయన గుర్తు చేశారు. వారి త్యాగాలకు ఎల్లపుడు భారత్ రుణ పడి ఉంటుదని పేర్కొన్నారు. అనంతరం నేవీ, ఎన్‌సిసి విద్యార్థులు విద్యానగర్ గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కోట ఎస్ఐ. పవన్ కుమార్ , ఎన్‌సీసీ ఆఫీసర్లు, మాదవయ్య, మల్లికార్జున్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ పారిశ్రామికవేత్త తానంకి నానాజీ సైకత శిల్పం




చిల్లకూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : ప్రముఖ పారిశ్రామికవేత్త, పెనుశిల లక్ష్మి నరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ జన్మదినం సందర్భంగా ఆయన సైకత శిల్పంతో చిల్లకూరు మండలంలోని ఏరూరు గ్రామానికి కళాకారుడు మంచాల సనత్ హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కళాకారుడు మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకొని పేదలకు సహాయ సహకారాలు అందించాలని ఆకాంక్షించాడు. నానాజీ చిత్రపటాన్ని సిలికా సెండ్‌తో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## వాటర్ ప్లాంట్ ప్రారంభం



చిల్లకూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : మండల పరిధిలోని ఏరూరు గ్రామానికి చెందిన సత్తుకుమాటి సుధీర్ రెడ్డి శతకమాటి అఖిల్ రెడ్డి జ్ఞాపకార్థంతో ఏరూరు గ్రామంలో శుక్రవారం సతుకుమాటి ప్రగతి చేతుల మీదగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద ప్రజలు దాకం తీర్చేందుకు స్వచ్ఛమైన నీరు అందించాలన్న ఒక సంకల్పంతో వాటర్ ప్లాంట్ ఉచితంగా త్రాగునీరు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం చిల్లకూరు గ్రామంలోని ఏర్పాటై ఉన్న డానియల్ చిల్డ్రన్ హోం నందు అన్నదానంతో పాటు విద్యాసామాగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో సత కుమటి సుధీర్‌కుమార్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రీసర్వేలో 525 అర్జీలను పరిష్కరించాం



వాకాడు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : డివిజన్ స్థాయిలో జరిగిన రెవిన్యూ సదస్సులో 801 రీ సర్వే కోసం అర్జీలు వచ్చాయని, ఇప్పటికే 525 రీ సర్వే అర్జీలను పరిష్కరించడం జరిగిందని గూడూరు డివిజన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ డివి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం వాకాడు మండలం గంగనపాలెంలో జరుగుతున్న రీ సర్వే పనులను ఆయన పరిశీలించారు. వాకాడు మండలంలోని ఇప్పుడు వరకు జరిగిన రిసర్వేలో 59 సమస్యలకు గాను 55 రీ సర్వే అర్జీలు పరిష్కరించడం జరిగిందన్నారు. ఆయన వెంట వాకాడు మండల సర్వేయార్ శకుంతల సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

**-రుయా ఆసుపత్రిలో పలు విభాగాలు తనిఖీ చేసిన కలెక్టర్ వెంకటేశ్వరన్**



తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : రుయాలో రోగులకు అందిస్తున్న వైద్యలు, అందుబాటులో ఉన్న మౌళిక సదుపాయాలపై శుక్రవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, రోగులకు ఉపయోగమైన ఫ్యాన్లు, ఎ.సీలు, మరుగుదొడ్లు, పారిశుధ్య అంశాలను అక్కడిక్కడే అధికారులకు సూచనలు, ఆదేశాలిచ్చారు. క్యాజువాలిటీ ఎమర్జెన్సీ వార్డులో ఐసీయూ బెడ్లు అవసరం మేరకు లేవని, 40 బెడ్లు ఏర్పాటులకు చర్యలు తీసువాలన్నారు. వినియోగంలో లేని పనికిరాని సామాగ్రిని నిబంధనల మేరకు తరలించాలని తెలిపారు. అక్యూట్ మెడికల్ కేర్ నందు అవసరమయ్యే మందులను ఫార్మసీ సిబ్బంది, మందుల కొరత లేకుండా ఏపీఎంఎస్ఐడిని వారి వద్ద నుండి సరఫారా లేని మందులను స్థానికంగా కొనుగోలు చేసి వైద్య సేవలకు వచ్చే పేద రోగులకు ఇవ్వాలన్నారు. ఎలక్ట్రోలైట్ పరీక్షలు రోగులకు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించగా, ఆటో అనలైజర్ మిషన్ సమస్య అని అధికారులు తెలుపగా సోమవారం నాటికి అందుబాటులోనికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవా లన్నారు. అదే విధంగా ఓపి విభాగం, ఎమర్జెన్సీ విభాగాలా ప్రాంతాల్లో సరైన వెలుతురు లేదని లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ల్యాబ్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఇ-హాస్పిటల్ విధానం ఏర్పాటు నెలోఓపు జరగాలని, ల్యాబ్ రిపోర్టులు అందులోనే జరగాలని అవసరమైతే డేటా ఎంట్రా అపరేటర్‌ను వినియోగించు కోవాలన్నారు. ఎంఆర్ఐ సిటీ స్కాన్ రిపోర్టులు పరీక్షలు నిర్వహించిన అదే రోజు రోగులకు అందించాలన్నారు. నిర్మాణంలో ఉన్న భవనాలను కలెక్టర్ పరిశీలించి, పూర్తిచేయుటకు అవసరమైన నిధులను సమకూరుస్తామని అధికారులకు వివరించారు. మార్చి 15వ తేదీలోపు పెండింగ్ పనులు పూర్తి చేసి ప్రారంభించడానికి సిద్ధంగా ఉండాలని, రుయా నుండి ఫార్మసీ స్టోర్ సిడిఎస్ బిల్డింగ్‌లోనికి ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తిస్థాయిలో తరలించా లన్నారు. ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవి ప్రభు, డిఎంహెచ్ఓ బాలాజీ నాయక్, ఎస్వీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఏ.చంద్రశేఖరన్, సిఎస్ఆర్ఎమ్ఓ సుబ్బులక్ష్మమ్మ, ఎఆర్ఎమ్ ఓ.హరికృష్ణ, ఏపీఎంఎస్ఐడిసి ఈఈ శివరామిరెడ్డి, హెచ్‌డి ఎస్ సభ్యులు సందీప్, షేక ఖాజా మొహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల పక్షాన పోరాటం

**- నిరసన కార్యక్రమంలో జిల్లా వైకాపా అధ్యక్షులు భూమన**



చిత్తూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: చిత్తూరు కాసు బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ బస్టాండ్ ఆవరణలోని దుకాణదారులను వున్నపళంగా అక్కడి నుండి తరలించడానికి ప్రయత్నించడం అన్యాయమని, బాధితుల తరపున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని జిల్లా వైకాపా అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. చిత్తూరు పాత బస్టాండ్ దుకాణదారుల నిరసన కార్యక్రమం చిత్తూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎంసి విజయా నందరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా వైకాపా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ చిరు వ్యాపారుల కడుపు కొడ్తుందని, వైకాపా వీరికి అండగా నిలిచి పోరాటం సాగిస్తుందన్నారు. ఈ అంశంను ఇప్పటికే తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం తీరు మార్చు కోకుంటే అవసరమైతే వైఎస్ జగన్ చిత్తూరుకు వచ్చి బాధితులకు అండగా నిలుస్తారన్నారు. బడుగు, బలహీన, ముస్లీం, మైనార్టీ, పేద వర్గాలను నడి రోడ్డులోకి నెట్టడం పద్దతి కాదని దీనిని ఎవ్వరు హర్షించరన్నారు. నగరంలో ఎక్కడ విలువైన భూమి కన్పిస్తే అక్కడ పసుపు రంగు వేస్తున్నారని ఎంసి విజయానందరెడ్డి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు, వీధి వర్తకులు, తోపుడు బండ్ల వ్యాపారులు, మహిళలు, వైకాపా సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహనీయుడు దామోదరం సంజీవయ్య : కలెక్టర్



చిత్తూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: దేశం గర్వించగద్ద మహనీయుడు, రాష్ట్ర మొదటి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని పాత గ్రీవెన్స్ హాలులో శుక్రవారం జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర మాజీ సిఎం దామోదరం సంజీవయ్య 104వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లాలో సైతం ఎస్సీ, ఎస్టీ కాలనీలు ఎక్కడెక్కడ వున్నాయో గుర్తించి ప్రతి ఎస్సీ, ఎస్టీ కాలనీకు రోడ్లు వుండేలా విధులు నిర్వర్తించి ఈ ఏడాదిలో వంద శాతం రోడ్డు నిర్మాణాలు చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహం నాయుడు మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞశాలి అయిన దామోదరం సంజీవయ్యను ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత సిఎం నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యుటీ మేయర్ రాజేష్‌కుమార్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి మూర్తి, డిఇఓ వరలక్ష్మీ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మూడు వారాల్లో సెటిల్మెంట్ రిజిస్టర్లు పూర్తి : కలెక్టర్

చిత్తూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: డికెటి, ప్రభుత్వ, వెబ్‌ల్యాండ్, దేవాదాయ, కోర్టులో వున్న భూములకు సంబంధించి సెటిల్‌మెంట్ రిజిస్టర్లను మూడు వారాల్లో పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ తహసిల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శుక్రవారం కలెక్టర్ సుమిత్ కుమార్ జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్‌లతో కలిసి డీఐఓలు, సర్వే ఆఫ్ ఇన్స్ పెక్టర్లు, ఆర్ఎస్ డిటిలు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు, విఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, వెబ్‌ల్యాండ్, దేవాదాయ, కోర్టులో వున్న భూములకు సంబంధించి సెటిల్‌మెంట్ రిజిస్టర్లలో ఎదైనా కరెక్షన్లు వుంటే మూడు వారాల్లో పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో రీ-సర్వేకు సంబంధించి ఎక్కడెక్కడ పెండింగ్ వుంది అనేది తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో సర్వే నిర్వహణలో ఎదైనా సమస్యలు వుంటే కలెక్టరేట్‌లో వున్న తహసిల్దార్లకు సత్వరం తెలియజేయాలన్నారు. జెసి విద్యాధరి మాట్లాడుతూ జిల్లాలోని 31 మండలాల్లో ప్రతి మండల పరిధిలో ఒకొక్క గ్రామంలో రీ-సర్వే జరుగుతున్నదన్నారు. అందులో ఇప్పటి వరకు 13 గ్రామాల్లో ఎప్‌సిఓఎల్ఆర్ పూర్తి చేయడం జరిగిందని, ప్రస్తుతం రీ-సర్వే సందర్భంగా ప్రభుత్వ భూముల గ్రామ వారీగా హద్దులు గుర్తించడంలో ఎలాంటి పొరబాట్లు లేకుండా సెటిల్మెంట్ రిజిస్టర్లు పూర్తి చేయాలన్నారు. ముందుగా డికెటి, ప్రభుత్వ, వెబ్‌ల్యాండ్, దేవాదాయ, కోర్టు కేసులకు సంబంధించి భూములు ఏ సర్వే నెంబర్లలో వున్నాయనే విషయంను అధికారులు పరిశీలించు కోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ సర్వేయర్ ఎ.గణేష్, గుణశేఖర్, డిఐఓలు, ఇన్స్ పెక్టర్ ఆఫ్ సర్వేయర్లు, ఆర్ఎస్‌డిటిలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

## సంజీవయ్య జయంతి వేడుకలో ఎమ్మెల్యే, కలెక్టర్



పిచ్చాటూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రెండవ సీఎం, తొలి దళిత ముఖ్యమంత్రి సంజీవయ్య నేటియువతకు ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే ఆదిమూలం కొనియాడారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మాజీ ముఖ్యమంత్రి దామోధర్ సంజీవయ్య 104వ జయంతి వేడుకలను శుక్రవారం తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వెంకటేశ్వరులు, జేసీ శుభం బన్సల్, అధికారులు ఘనంగా నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొని సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పి ంచారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండవ సీఎంగా, తొలి దళిత ముఖ్యమంత్రి సంజీవయ్య కావడం తమకంతా గర్వకారణమన్నారు. సంజీవయ్య సేవలను గుర్తించి ఆయన జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించే అవకాశం కల్పించిన మన గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, జేసీ శుభం బన్సల్‌లు మాజీ ముఖ్య మంత్రి సంజీవయ్య పాలనలో చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవి మనోహరాచారి, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి విక్రమ్, పలువురు ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వసతులతో కూడిన వైద్యం అందించండి

**- వైద్యులతో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సమీక్ష**



పలమనేరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త: పలమనేరు 100 పడకల ఆసుపత్రిలో మెరుగైన వసతులతో కూడిన వైద్యం అందించడానికి కృషి చేయాలని పలమ నేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాల యంలో స్థానిక ప్రభుత్వం ఆసుపత్రి వైద్యులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రోగులు వారి సహాయకులకు ప్రస్తుతం ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు. ఆసుపత్రిలో మెరుగైనా సేవలతో పాటు వసతులను కల్పించాల్సి ఉందని, ఇంకా అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయని వాటి వివరాలను తీసుకున్నారు. ఆక్సి జన్ పైపులైను, లిఫ్ట్ ఏర్పాటు, 10 స్ట్రక్చర్లు, బ్యాక్ రెస్ట్ బెడ్లు, రోగుల సహాయకుల కోరకు కుర్చీలు ఏర్పాటు, దోమల బెడద లేకుండా కిటికీలకు మెష్‌లు, 34 పరుపులతో పాటు కంప్యూటర్, ప్రింటర్ల అవసరమున్నట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో తక్కువ ధరకు నాణ్యమైన ఆహారం అందేలా క్యాంటీన్ ఏర్పాటు చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ మమతా రాణి, ఆసుపత్రి కమిటి సభ్యులు నాగరాజు, సుధాకర్‌తో పాటు పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : జిల్లా పోలీస్ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య గారి చిత్రపటానికి పూలమాలవేసి తిరుపతి జిల్లా ఎస్పీ. వి.హర్షవర్ధన్ రాజు ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, దామోదర సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్బంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సంజీవ య్య తొలి దళిత ముఖ్యమంత్రిగాను, సంయుక్త మద్రాసు రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వంలో అనేక సార్లు ఆయన మంత్రి పదవులను నిర్వహించారు. రెండుసార్లు అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా కూడా పనిచేయడం ఈయన ప్రత్యేకత. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరచారి శాంతిభద్రతలు, నాగభూషణం రావు, నేర విభాగం శ్రీనివాస రావు సాయుధ దళం, డీఎస్పీలు, రవీంద్రారెడ్డి, సీఐలు, ఆర్ఐలు, జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కనులపండువగా అమ్మవారి ప్రాకారోత్సవం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి శుక్రవారం అమ్మవారికి ప్రాకారోత్సవాన్ని కనులపండువగా నిర్వహిస్తారు. ఈనేపథ్యంలో ఆలయంలోని అలంకార మండపంలో ఉన్న అమ్మవారి ఉత్సవ మూర్తికి విశేష అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేపట్టారు. అనంతరం అలంకార మండపం నుంచి అమ్మవారిని భక్తులు పల్లకీపై మోసుకువస్తూ ఆలయంలోనే ప్రదక్షణ చేయించారు. అనంతరం అమ్మవారికి విశేష హారతు లిచ్చారు. ఈఉత్సవాన్ని చూడడానికి స్థానిక భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో పలువురు ఆలయాధికారులు పాల్గొన్నారు.